## 2022 మార్చి, 7వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు
## 2022-23 వార్షిక బడ్జెట్ సమర్పిస్తూ..
## గౌరవనీయులు, ఆర్థిక శాఖామాత్యులు
## శ్రీ తన్నీరు హరీశ్ రావు గారి ప్రసంగం

**గౌరవ అధ్యక్షా.. !**

1. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన అనతికాలంలోనే దేశంలోకెల్లా అగ్రగామి రాష్ట్రంగా రూపుదాల్చింది. తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి సారథ్యంలో స్వరాష్ట్ర స్వప్నం సాకారమయ్యింది.

2. సమైక్య రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా నానా అగచాట్లు పడుతున్న తెలంగాణ ప్రజానీకాన్ని కేసీఆర్‌గారు మేల్కొల్పిన తీరు.. ఉద్యమాన్ని రగిలించి రాష్ట్రాన్ని సాధించిన తీరు చారిత్రాత్మకం.

3. తెలంగాణ సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సాధికారత కలిగిన ఉద్యమ సారథినే, స్వరాష్ట్ర రథసారథిగా ప్రజలు ఎన్నుకున్నారు. తెలంగాణ పునర్నిర్మాణ బాధ్యతను వారి భుజస్కంధాల పైనే మోపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రజలు తమపై ప్రకటించిన విశ్వాసాన్ని వందకు వంద శాతం నిలబెట్టుకుంటూ, ఆనాడు ఎంతటి నిబద్ధతతో ఉద్యమాన్ని ముందుకు నడిపించారో.. అంతే నిబద్ధతతో ఈనాడు రాష్ట్రాన్నీ అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారు. పోరాట

దశ నుంచి, రాష్ట్ర ఆవిర్భావం వరకు, నూతన రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా అవతరింపజేసిన సందర్భం వరకు అంతా మన కండ్ల ముందే జరిగిన, జరుగుతున్న అద్భుత చరిత్ర.

4. నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రతీదీ నూతనంగా నిర్వచించుకోవాల్సిందే, నూతనంగా నిర్మించుకోవాల్సిందే. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికలను తెలంగాణ కోణంలో రూపొందించుకోవాల్సిందే.

5. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తొలి శాసనసభ సమావేశంలోనే మాట్లాడుతూ 'Telangana needs to reinvent itself and to reorient itself" అని చెప్పారు.

6. పటిష్టమైన Fiscal Prudence పాటిస్తూ, అవినీతికి ఆస్కారం లేని విధంగా టిఎస్ ఐపాస్, టిఎస్ బిపాస్, ధరణి, డిజిటల్ నగదు బదిలీ వంటి పారదర్శక విధానాలు అమలు చేయడం వల్ల రాష్ట్ర సంపదను గణనీయంగా పెంచారు. ప్రగతి ప్రస్థానంలో అనేక సవాళ్లను అధిగమించారు. క్లిష్టమైన సమస్యలను పరిష్కరించారు. ప్రజల అండదండలతో తెలంగాణను అద్భుతమైన ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారు.

**అవినీతి రహిత పారదర్శక పాలన..**

7. పరిపాలనలో టీఆర్ఎస్ ప్రభుత్వం రాజీలేని వైఖరిని అవలంబించింది. ఎక్కడా అవినీతికి ఆస్కారం ఇవ్వలేదు. అడుగడుగునా పారదర్శకతను పాటించింది. కడుపు, నోరు కట్టుకొని నీతిగా, నిజాయితీగా పరిపాలించింది. ప్రతి పథకం ప్రయోజనం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో చేరుతుండడమే దీనికి సాక్ష్యం.

8. దరఖాస్తు పెట్టాల్సిన పనిలేదు, ఆఫీసుల చుట్టూ కాగితాలు పట్టుకొని కాళ్ళరిగేలా తిరగాల్సిన అవసరం లేదు. డిజిటల్ మనీ ట్రాన్స్ఫర్ విధానంలో నగదును ప్రభుత్వం నేరుగా లబ్దిదారుల ఖాతాలలో జమ చేస్తోంది. అది ఆసరా పింఛన్ కానీ, రైతుబంధు కానీ, దళితబంధు కానీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి.. హైదరాబాద్ లో మీట నొక్కితే.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారుల ఫోన్లు "టింగు, టింగు, టింగు, టింగుమని మోగుతున్నాయి. ఖాతాలోకి డబ్బు చేరిన సమాచారాన్ని గంటకొట్టి మరీ తెలియజేస్తున్నాయి. అందుకే ప్రజలు పదేపదే కేసీఆర్‌గారి నాయకత్వం పట్ల, టి.ఆర్.ఎస్. ప్రభుత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. అద్భుతమైన విజయాలను అందిస్తున్నారు.

9. అధ్యక్షా.. ఏడేళ్ల క్రితం సమైక్య పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా ఇదే సభలో పేగులు తెగే దాకా కొట్లాడినం. ఆ చీకటి రోజులు తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది. రాష్ట్రం ఏర్పడిన నాడు

తెలంగాణ పరిస్థితి చూస్తే కరువు కాటకాలు, సాగునీరు లేదు, తాగునీరు లేదు. రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు, తీవ్రమైన కరెంటు కోతలు, పవర్ హాలిడేలు, ఇందిరాపార్క్ దగ్గర పారిశ్రామికవేత్తల ధర్నాలు.. సమస్యల వలయంలో తెలంగాణ విలవిలలాడుతున్నది. పరిపాలన పగ్గాలు చేపట్టిన వెంటనే చిక్కుముళ్లను విప్పుకుంటూ, స్పష్టతను సాధిస్తూ, క్రమక్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు సాగాము.

10. నేడు తెలంగాణ కరువు కాటకాల నుంచి సాగునీటి సమృద్ధిని సాధించింది. కరెంటు కోతల నుంచి 24 గంటల విద్యుత్తు కాంతులలోకి పయనించింది. సంక్షోభకాలం నుంచి సంక్షేమ యుగంలోకి ప్రవేశించింది. అవమాన పరంపర నుంచి ఆత్మగౌరవ చైతన్యంలోకి అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రజాస్వామ్య భారత చరిత్రలో తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానం ఒక అద్భుతం.

11. **Today Telangana is a Torch Bearer. "నేడు తెలంగాణ ఆచరించింది, రేపు దేశం అనుసరిస్తుంది**" ఈ మాట అక్షర సత్యం. ఈ ఏడున్నర సంవత్సరాల చరిత్రే దానికి సాక్ష్యం. ఈ ప్రగతి యాత్రకు కొనసాగింపే నేడు నేను ప్రవేశపెడుతున్న బడ్జెట్. 2022- 23 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాన్ని నాకు కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, శాసనసభకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

12. నాయకుడు దక్షత ఉన్నవాడైతే లక్షలకైనా.. కోట్లకైనా సార్థకత చేకూరుతుంది. ఖజానాకు ఎంత ధనం వచ్చి చేరిందన్నది కాదు... ఆ ధనం ప్రజల జీవితాల్లో ప్రతి ఫలించిందా? లేదా ? అన్నదే ముఖ్యం. **బడ్జెట్ అంటే అంకెల సముదాయం కాదు.. ప్రజల ఆశల, ఆకాంక్షల వ్యక్తీకరణ.**

13. బడ్జెట్‌లోని వివిధ పద్దుల వివరాల్లోకి వెళ్లేముందు ఒక కఠోర వాస్తవాన్ని నేను ప్రస్తావించక తప్పడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడా మనకు వివక్ష ఎదురవుతూనే ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో సమైక్య పాలకులు వివక్ష చూపితే. స్వరాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది.

14. కేంద్రం వైఖరి గురించి తెలంగాణ ప్రజల మాటల్లో చెప్పాలంటే 'కాళ్లల కట్టె పెట్టినట్టు' ఉంది. ప్రగతి శీల రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం లేకపోగా నిరుత్సాహం కలిగించేలా కేంద్రం వ్యవహరిస్తున్నది. తెలంగాణ పురిటి దశలో ఉన్నప్పటి నుంచే కేంద్రం దాడి ప్రారంభమయ్యింది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలైనా జరుపుకోకముందే, ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు కట్టబెట్టింది. తెలంగాణ తొలి అడుగులోనే కేంద్ర అప్రజాస్వామిక చర్యను నిరసిస్తూ బంద్‌ను పాటించాల్సి వచ్చింది. ఏడు మండలాల అక్రమ బదలాయింపుతో మన రాష్ట్రం లోయర్ సీలేరు విద్యుత్తు ప్రాజెక్టును కోల్పోయింది. ఐదేళ్ళ పాటు హైకోర్టు విభజన చేయకుండా కేంద్రం అనవసరంగా తాత్సారం చేసింది.

విభజన చట్టంలో పేర్కొన్న హామీలను ఇప్పటికీ అమలు చేయటంలేదు. ఇవి చాలవన్నట్టు పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం గురించి చర్చ జరిగిన ప్రతీసారి "తల్లిని చంపి బిడ్డను బతికించారు" అని పదే పదే వ్యాఖ్యానిస్తూ కేంద్ర ప్రభుత్వ పెద్దలు తెలంగాణ ప్రజల మనోభావాలను దారుణంగా దెబ్బతీస్తున్నారు.

15. తెలంగాణలో అమలు పరుచవలసిన ఐ.టి.ఐ.ఆర్. ను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. ఐ.టి.ఐ.ఆర్. అమలు చేసి ఉంటే తెలంగాణ ఐటీ రంగం మరింతగా పురోగమించేది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించేది. కేంద్రం ఆ అవకాశం లేకుండా చేసింది.

16. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలోని ఆనాటి 9 ఉమ్మడి జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించింది. కానీ, ఈ జిల్లాలకు రావాల్సిన నిధులు ఇవ్వడంలో అనవసర జాప్యం చేస్తోంది. ఒకవైపు కో-ఆపరేటివ్ ఫెడరలిజం అని గొప్పగా చెప్తూ రెండో వైపు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల అధికారాలను కబళిస్తోంది.

17. కొత్త రాష్ట్రానికి అదనపు నిధులు ఇవ్వాలని కోరుతూ, ఎంతో ఆశతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సర్కారుకు ఎన్నో ప్రతిపాదనలు సమర్పించింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి గారే స్వయంగా పూనుకొని, ప్రధాన మంత్రి గారికి వినయంగా విన్నవించారు. కానీ లాభం లేకపోయింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు 24 వేల కోట్ల ప్రత్యేక నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసులనూ కేంద్రం బుట్టదాఖలు చేసింది. 24 వేల కోట్లు కాదు కదా 24 పైసలు కూడా ఇవ్వలేదు.

18. కొత్త రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పన్ను మినహాయింపుతో పాటూ ఇతర ప్రోత్సాహకాలను ఇవ్వాలని ఏ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(1) పేర్కొంది. కానీ, చెప్పుకోదగ్గ ప్రోత్సాహకాలేవీ కేంద్రం ఇవ్వలేదు. విభజన చట్టంలోని హామీలైన బయ్యారం స్టీల్ ప్లాంటు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీల విషయంలో అతీగతీలేదు. రైల్ కనెక్టివిటీని పెంచే ప్రతిపాదనలు పెండింగ్ లోనే పెడుతున్నది.

గిరిజన యూనివర్సిటీకి సంబంధించి కంటితుడుపుగా కేవలం 20 కోట్లను విదిల్చింది. కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం తెలంగాణకు విడుదల చేయాల్సిన 495 కోట్ల మొత్తాన్ని పొరపాటుగా ఆంధ్రప్రదేశ్ ఖాతాలో జమచేసింది. ఏడేళ్ల నుంచి అడుగుతున్నా ఇప్పటికీ మన రాష్ట్ర నిధులను తిరిగి ఇవ్వలేదు. దీన్నిబట్టి కేంద్ర నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంకోపక్క జహీరాబాద్‌లోని 'నిమ్జ్' (NIMZ) కు సంబంధించి కేంద్రం వాటా 500 కోట్ల రూపాయలను ఇప్పటికీ ఇవ్వలేదు.

19. ఆర్థిక సంఘాల సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం ఆనవాయితీ. కానీ, ప్రస్తుత కేంద్ర సర్కారు ఆ ఆనవాయితీని ఎంత మాత్రం పాటించడం లేదు. 15వ ఆర్థిక సంఘం మన రాష్ట్రానికి 2020-21 సంవత్సరానికి 723 కోట్ల రూపాయలను ప్రత్యేక గ్రాంటుగా ఇవ్వాలని సిఫార్సు చేసింది. కేంద్రం ఆ సిఫార్సును బుట్టదాఖలు చేసింది.

20. రాష్ట్రానికి ఇచ్చే నిర్దిష్ట గ్రాంట్లు 2362 కోట్ల రూపాయలు విడుదల చేయలేదు. అదే విధంగా సెక్టార్ స్పెసిఫిక్ గ్రాంట్లు 3,024 కోట్ల రూపాయలు ఇవ్వలేదు. ఈ మొత్తం గ్రాంట్లు కలిపి 5,386 కోట్ల రూపాయల నిధులను తెలంగాణకు ఇవ్వకుండా కేంద్రం తొక్కిపెట్టింది.

21. కరోనాతో దేశం ఎంతటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నదో అందరికీ తెలిసిందే. ఆ సమయంలోనూ కేంద్రం రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదు. పైగా న్యాయ సమ్మతంగా దక్కాల్సిన నిధులలో కోతలు విధించింది. కంటితుడుపుగా రుణపరిమితిని పెంచుతూ దానికి షరతులు విధించింది. ఎఫ్ ఆర్ బి ఎం పెంపుదలకు, విద్యుత్తు సంస్కరణలకు లంకెపెడుతూ కేంద్రం రాష్ట్రాల మెడ మీద కత్తి పెట్టింది. రైతు వ్యతిరేక విద్యుత్ సంస్కరణలు అమలు చేయకపోవడం వల్ల తెలంగాణ ఏటా 5 వేల కోట్లు సమకూర్చుకునే అవకాశం కోల్పోయింది. మొత్తం ఐదేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు నష్టపోతుంది. దీన్నిబట్టి కేంద్రం ఎంత నిరంకుశంగా

వ్యవహరిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇరవై ఐదు వేల కోట్ల రూపాయల కోసం చూస్తే బాయిలకాడ మీటర్లు పెట్టాలి. రైతుల నుంచి కరెంటు ఛార్జీలు వసూలు చేయాలి. రైతుల మీద ఛార్జీల భారం వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగాలేదు. అది మా విధానమే కాదు. "కంఠంలో ప్రాణం ఉండగా విద్యుత్తు సంస్కరణలకు ఒప్పుకోము" అని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కేంద్రానికి తెగేసి చెప్పారు. నాలుగు కోట్ల ప్రజల శ్రేయస్సు కోసం 25 వేల కోట్ల రూపాయలు వదులుకోవడానికే సిద్ధపడ్డారు. ఎందుకంటే మాది రైతు ప్రభుత్వం కనుక.. రైతు బిడ్డ పాలిస్తున్న ప్రభుత్వం కనుక.

22. కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదు, ఒక్క పథకానికీ డబ్బులు ఇవ్వలేదు. అంతా శుష్క ప్రియాలు, శూన్య హస్తాలు. పోనీ మనకు మనం రుణం తెచ్చుకోనైనా అభివృద్ధి చేసుకుందామనుకుంటే దానికీ మోకాలడ్డుతోంది.

23. కేంద్రం పన్నుల రూపంలో వసూలు చేసే ఆదాయం మొత్తంలోంచి న్యాయబద్ధంగా 41 శాతం రాష్ట్రాలకు రావాలి. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన ఈ వాటాను కుదించడానికి కేంద్రం సెస్సుల రూపంలో దొడ్డిదారిన ఆదాయం సమకూర్చుకుంటున్నది. సెస్సుల రూపంలో వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఉండదు. దీన్ని ఆసరాగా చేసుకొని రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయంలో 11.4 శాతం ఆదాయానికి కేంద్రం గండి

కొడుతోంది. రాష్ట్రాలకు 41 శాతం రావాల్సిన చోట 29.6 శాతం మాత్రమే ఇచ్చి అన్యాయం చేస్తోంది. కేంద్రం చేస్తున్న ఈ నిర్వాకాన్ని15వ ఆర్థిక సంఘం తప్పు పట్టింది. అయినా.. నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంగానే కేంద్రం వ్యవహరిస్తోంది.

24. ఇన్ని రకాల ప్రతికూలతలు, పరిమితుల మధ్య తెలంగాణ రాష్ట్రం బలీయమైన ఆర్థిక శక్తిగా ఎదిగింది. దీనికి కారణం ముఖ్యమంత్రి గారి దార్శనికత, అవినీతి రహిత పరిపాలన, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పటిష్టమైన ఆర్థిక విధానాలు. డెబ్బై అయిదేళ్ల స్వతంత్ర భారత దేశ చరిత్రలో 50 వేల కోట్ల రూపాయలు రైతులకు పంట పెట్టుబడిగా అందించిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఏ కారణం చేతైనా రైతు మరణిస్తే ప్రీమియం భారం లేకుండా 5 లక్షల రూపాయలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ ద్వారా 10 లక్షల మంది పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లు జరిపించిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. 10 లక్షల మంది తల్లులకు కేసీఆర్ కిట్లను అందించిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఎనిమిదేళ్ల కాలంలో నలబై ఆరు వేల ఆరు వందల యాభై కోట్ల రూపాయలను ఆసరా ఫించన్ల రూపంలో పేదలకు అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఇంటింటికి నల్లాలు పెట్టి స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. తలసరి విద్యుత్ వినియోగ వృద్ధిలో

దేశంలోకెల్లా ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రం తెలంగాణ. అత్యధిక షీప్ పాపులేషన్ కలిగిన రాష్ట్రం తెలంగాణ. ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, డంపుయార్డు, వైకుంఠ ధామం ఏర్పాటు చేసిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ముఖంపై సంతోషం అనే నినాదాన్ని నిజం చేసిన రాష్ట్రం తెలంగాణ. ఇది ఏడేళ్ల చరిత్ర చాటుతున్న సత్యం. ఇది ఎవరూ కాదనడానికి వీల్లేని వాస్తవం.

25. సంపన్నులు మరింత సంపన్నులైతే ఆ సంపద వారి నుంచి పేదల వైపు ప్రవహిస్తుందని చెప్పే ట్రికిల్ డౌన్ థియరీ బడ్జెట్ కాదు మాది. బడా కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడే బడ్జెట్ అంతకంటే కాదు. ఇది బడుగుల జీవితాలు మార్చే బడ్జెట్ ! ఇది ముమ్మాటికీ, కేసీఆర్ మార్కు బడ్జెట్ !!

**ప్రగతిపథంలో దూసుకుపోతున్న తెలంగాణ**

26. 2013-14లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిననాడు రాష్ట్ర జీ.ఎస్.డి.పి. 4,51,580 కోట్ల రూపాయలు. అది 2021-22 నాటికి 11,54,860 కోట్ల రూపాయలకు చేరింది. 2015-16 నుంచి రాష్ట్ర జి.ఎస్.డి.పి వృద్ధి రేటు జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉన్నది. పైగా ఏటికేడు వృద్ధి రేటు మధ్య వ్యత్యాసం పెరుగుతూ వస్తున్నది. కరోనా విపత్తు నేపథ్యంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో జాతీయ వృద్ధి రేటు మైనస్ 1.4 శాతం నమోదైంది. అనేక రాష్ట్రాలు కూడా నెగెటివ్ గ్రోత్ రేటును నమోదు చేశాయి. కానీ తెలంగాణ మాత్రం 2.2 శాతం పాజిటివ్ వృద్ధి రేటు సాధించింది. ఇది వ్యక్తిగతంగా నాకు ఎంతో సంతృప్తిని కలిగించింది.

వాస్తవానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత బలమైన పునాదులపై తెలంగాణ పునర్నిర్మాణం చెందుతున్నదని, స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నదని చెప్పడానికి కరోనా విపత్తు సందర్భంలోను పెరిగిన ఆర్థిక వృద్ధి రేటు సాక్ష్యంగా నిలిచింది. తెలంగాణ 2015-16 నుంచి 2020-21 మధ్య సగటున 11.7 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. తద్వారా దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రగామిగా నిలిచింది.

27. ముందస్తు అంచనాల ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరంలోనూ తెలంగాణ జి.ఎస్.డి.పి వృద్ధి రేటు స్థిర ధరల వద్ద 11.2 శాతం ఉంటుందని అంచనా. అదే సమయంలో దేశ జి.డి.పి వృద్ధి రేటు 8.9% గా అంచనా వేశారు. ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జి.ఎస్.డి.పి వృద్ధి రేటు 19.1 శాతంగా అంచనా వేస్తే.. దేశ జి.డి.పి వృద్ధి 19.4 శాతంగా ఉండనుంది. దీనిని బట్టి తెలంగాణ అత్యంత వేగంగా కొవిడ్ విపత్తు నుంచి కోలుకున్నట్టు అర్థమవుతుంది.

28. తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి దేశ జి.డి.పి వృద్ధికి కూడా కీలకంగా మారింది. దేశ జి.డి.పి లో తెలంగాణ వాటా 2014-15 లో 4.06 శాతంగా ఉంటే 2021-22 నాటికి 4.97 శాతానికి పెరిగింది. ఏడేళ్లలో దేశ జీ.డి.పి.కి ఒక శాతం అదనపు వాటా అందించిన ఒకే ఒక్క రాష్ట్రం మన తెలంగాణ.

29. తెలంగాణది సమ్మిళిత వృద్ధి. ఏ ఒక్క రంగం మీదనో ఆధారపడి లేదు. ముఖ్యంగా 2020-21లో పారిశ్రామిక, సేవా రంగాలు

అద్భుతమైన వృద్ధిరేటు నమోదు చేశాయి. ఉత్పత్తి, నిర్మాణ రంగాలు కలిగి ఉన్న ద్వితీయ రంగం ప్రస్తుత ధరల వద్ద 21.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది వృద్ధి -0.3 శాతంగా ఉంది.

30. సేవా రంగం సైతం 18.3 శాతం వృద్ధి రేటు సాధించింది. అంతకుముందు ఏడాది వృద్ధి 0.9 శాతం మాత్రమే.

**తలసరి ఆదాయం**

31. తలసరి ఆదాయం పెరుగుదల కోణంలో చూసినప్పుడు తెలంగాణ ఆర్థికంగా వృద్ధి సాధించడంతోపాటు జీవన ప్రమాణాల పెరుగుదలలో అద్భుతమైన ప్రగతి సాధించింది. 2014-15 లో రాష్ట్ర తలసరి ఆదాయం 1,24,104 రూపాయలు. ఇది ఆనాటి దేశ తలసరి ఆదాయమైన 86,647 రూపాయలకంటే 43శాతం ఎక్కువ. 2021-22 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం 2,78,833 రూపాయలకు పెరిగింది. జాతీయ సగటు ఆదాయమైన 1,49,848 రూపాయలకంటే ఇది 86 శాతం అధికం. జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయ వృద్ధిరేటులో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది.

32. 2021-22 లో రాష్ట్ర తలసరి ఆదాయం 18.8 శాతం వృద్ధి రేటు సాధించగా, జాతీయ వృద్ధి 18.1 శాతంగా నమోదైంది. 2014-15 లో

దక్షిణాధి రాష్ట్రాల్లో నాలుగో స్థానంలో ఉన్న తెలంగాణ.. 2020-21 వచ్చే సరికి అగ్రస్థానానికి చేరింది. ఇది తెలంగాణ ప్రజల విజయం.

33. తెలంగాణ స్థిరమైన వృద్ధి రేటును సాధిస్తుందనీ, విపత్తులు ఎదురైనా వెనుకడుగు వేయదని దీనిని బట్టి అర్థం అవుతున్నది. అంతేకాదు అతి తక్కువ కాలంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలవడంతో పాటు, ఎకనామిక్ పవర్ హౌస్ గా మారిందని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు**

34. పేదల జీవితాలు మెరుగుపడినప్పుడే సాధించిన ఆర్థికవృద్ధికి సార్థకత అని నమ్మిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అభివృద్ధితో సంక్షేమాన్ని అనుసంధానించారు. ప్రజా సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

**తెలంగాణ దళిత బంధు**

35. దేశం నేడు స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపుకుంటోంది. 75 ఏళ్ల స్వాతంత్ర్యం సాక్షిగా దళిత జాతి సాధికారికత అనేది కలగానే మిగిలిపోయింది. దేశాన్ని ఏలిన పాలకపక్షాలు కొన్ని పథకాలు చేపట్టినా అవి అసంపూర్ణ ఫలితాలనే ఇచ్చాయి. నిజమైన అభివృద్ధి దళితుల జీవితాల్లో నేటికీ కనిపించడంలేదు. రాజ్యాంగం అందించిన రిజర్వేషన్ల ఫలితంగా దళితులు విద్యను, ఉపాధిని పొందగలిగారు. అయినా

దళితవాడలు పేదరికానికి ఆనవాళ్లుగానే మిగిలిపోయాయి. మెజారిటీ దళిత జనం ఇంకా రెక్కల కష్టం మీదనే ఆధారపడి బతుకుతున్నారనేది అంగీకరించాల్సిన చేదు నిజం.

36. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టింది. షెడ్యూల్డ్ కులాల, తెగల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఎస్సీ, ఎస్టీల జనాభా దామాషాను అనుసరించి, కొన్నిసార్లు దామాషాకు మించి కూడా ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఒక ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాని పక్షంలో ఆ నిధులు తరువాతి ఆర్థిక సంవత్సరానికి బదలాయించేలా చట్టంలో నిబంధన పెట్టింది. ఈ విధమైన చట్టం తెచ్చిన తొలి రాష్ట్రం తెలంగాణ. గడిచిన ఆర్థిక సంవత్సరంలో దళితుల కోసం చేసిన ఖర్చు వివరాలను గౌరవ శాసనసభ్యులకు ఎప్పటిలాగానే పెన్‌డ్రైవ్ ద్వారా ప్రభుత్వం అందజేస్తోంది.

37. భారత రత్న డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో, దళిత జాతి ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు “దళిత బంధు” అనే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దళిత జాతి తర తరాలుగా అనుభవిస్తున్న పేదరికాన్ని, సామాజిక వివక్షను అంతమొందించే ఆయుధం ‘‘తెలంగాణ దళిత బంధు”. ఈ కార్యక్రమం దేశానికే దిశా నిర్దేశం చేస్తున్నదనడంలో ఎటువంటి సందేహం లేదు.

38. దళితబంధు కేవలం ఒక పథకం మాత్రమే కాదు. దళితులకు ఉపాధిని, ఆత్మగౌరవాన్ని, అభివృద్ధిని, వికాసాన్ని చేకూర్చే ఒక దృక్పథం. ఒక సమర్ధవంతమైన విధానం. దళిత జాతి ఆర్థిక ప్రగతి సాధించిన నాడు సామాజిక అంతరాలు క్రమ క్రమంగా అంతరిస్తాయి. మానవ సంబంధాలు సమానత్వంతో పరిమళిస్తాయి.

39. రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి ఉపాధి కోసం 10 లక్షల రూపాయల ఉచిత ఆర్థిక సహాయం అందించడం దళిత బంధులో ఒక భాగం. దేశంలో ఇంత పెద్ద నగదు మొత్తాన్ని ఏ పథకం ద్వారా ఎన్నడూ ఇవ్వలేదు. దళిత కుటుంబానికి ఇంతటి భారీ ఆర్థిక సహాయాన్ని నేరుగా అందిస్తున్న అతి పెద్ద నగదు బదిలీ పథకంగా దళిత బంధు చరిత్రకెక్కింది.

40. గత ప్రభుత్వాలు దళితుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను బ్యాంకు లింకేజీ, కొలాటరల్ సెక్యూరిటీలతో ముడి పెట్టడం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కలేదు. దళిత బంధు పథకానికి బ్యాంకు లింకేజీ లేదు, సెక్యూరిటీలతో నిమిత్తం లేదు. అంతేకాకుండా లబ్ధిదారులు వారికి వచ్చిన పనిని, నచ్చిన పనిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా గ్రాంటు రూపంలో పెద్ద మొత్తంలోఆర్థిక సహాయం అందివ్వడం తెలంగాణ దళిత బంధు పథకం గొప్పతనం.

**దళిత రక్షణ నిధి..**

41. దళిత బంధు ద్వారా లబ్ధిపొందిన కుటుంబం ఏదైనా ఆపదకు గురయ్యినప్పుడు ఆ కుటుంబ పరిస్థితి ఆర్థికంగా దిగజారిపోకూడదు. ఇందుకోసం దళిత రక్షణ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆపద సమయంలో ఈ నిధి వారికి కవచంగా నిలుస్తుంది.

**వివిధ వ్యాపారాల్లో దళితులకు రిజర్వేషన్లు..**

42. వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన మొట్టమొదటి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం. దీని వల్ల ఎంతో మంది దళితులు బడుగు బలహీన వర్గాల వారు, స్త్రీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు అయ్యే అవకాశం కలిగింది. దళితబంధు పథకంలో భాగంగా దళితులు వివిధ వ్యాపార రంగాల్లో పైకి ఎదగడానికి ప్రత్యేక రిజర్వేషన్లను అమలులోకి తీసుకువచ్చింది.

43. ప్రభుత్వ లైసెన్సులు పొంది ఏర్పాటు చేసుకునే వైన్ షాపులు, బార్ షాపులు, వివిధ రకాల కాంట్రాక్టులు మొదలైన వాటిలో రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 2,616 వైన్ షాపుల్లో 261 వైన్ షాపులు దళితులకు కేటాయించింది. లైసెన్సులు పొందిన దళిత కుటుంబాలు ఇది తాము కలలో కూడా ఊహించని అద్భుతమని సంబురపడ్డా .

44. దళిత బంధు పథకం ద్వారా మార్చి నెలాఖరు నాటికి 4వేల కోట్ల రూపాయలతో దాదాపు 40 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరబోతోంది. దళిత బంధు పథకాన్ని హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు చింతకాని, తిరుమలగిరి, నిజాంసాగర్, చారగొండ మండలాల్లో ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేస్తోంది. దాంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి వంద మంది చొప్పున మొత్తం 118 నియోజకవర్గాల్లో 11వేల 800 కుటుంబాలకు దళితబంధు పథకం కింద ఆర్థికసహాయం అందిస్తున్నది. వచ్చే సంవత్సరాంతానికి రెండు లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దశల వారీగా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు దళిత బంధు ప్రయోజనాలు అందివ్వటం ప్రభుత్వ లక్ష్యం.

2022-2023 వార్షిక బడ్జెట్లో దళిత బంధు పథకం కోసం 17,700 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

**పల్లె ప్రగతి- పట్టణ ప్రగతి**

45. తెలంగాణ ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రతతో, పచ్చదనంతో, సకల మౌలిక వసతులతో కళకళలాడేలా చేసింది. తెలంగాణ పల్లెలు సాధించిన ప్రగతి ప్రమాణాలతో పోల్చితే దేశంలో ఏ రాష్ట్రం కూడా మన దరిదాపుల్లో కూడా లేదు. ఇంత గుణాత్మకమైన మార్పుకు ప్రేరణగా నిలిచిన ముఖ్యమంత్రి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

46. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా అద్భుతమైన ఫలితాలను సాధిస్తోంది. పల్లె ప్రగతి అనే పేరుతో ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. 1994 లో రూపొందించిన పంచాయతీరాజ్ చట్టం అనేక లోపాలతో అసమగ్రంగా ఉన్న కారణంగా నూతన పంచాయతీ రాజ్ చట్టం అవసరమని ముఖ్యమంత్రి గారు భావించారు. 2018 నూతన పంచాయతీ రాజ్ చట్టానికి రూపకల్పన చేసి అమలులోకి తెచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పంచాయతీ రాజ్ చట్టం గ్రామ పంచాయతీల నిధులను, విధులను, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించింది.

**పంచాయతీ కార్యదర్శుల నియామకం**

47. తెలంగాణ ప్రభుత్వం పెరిగిన జనాభాకు అనుగుణంగా గ్రామ పంచాయతీల సంఖ్యను 12,769 కి పెంచింది. పరిపాలన సమర్థవంతంగా జరగడం కోసం ప్రతి గ్రామ పంచాయతీకి కార్యదర్శి ఉండే విధంగా 9355 పోస్టులను కొత్తగా మంజూరు చేసి నియమించింది. పంచాయతీ రాజ్ శాఖలో దిగువ స్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకు అన్ని పోస్టులను భర్తీచేసింది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల నిరంతర సమీక్ష, పర్యవేక్షణ కోసం ఐ.ఏ.ఎస్ అధికారులను లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్లుగా నియమించింది.

48. పరిశుభ్రతలోనే పరమాత్ముడు కొలువై ఉంటాడు అని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. గతంలో పల్లెల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, పాడుపడిన ఇండ్లు, బావులు, పిచ్చిమొక్కలు, నీటి కుంటలతో దోమలకు నిలయాలుగా ఉండేవి. గ్రామ పారిశుధ్యాన్ని నిర్వహించడానికి కావాల్సిన సాధనాలు పంచాయతీల వద్ద లేకపోయేవి. తెలంగాణ ప్రభుత్వం పట్టుపట్టి పల్లెల స్వరూపాన్ని మార్చేసింది. యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయల కల్పన చేసింది. ఇందులో భాగంగా చెత్త సేకరణతో పాటు వ్యర్థాల నిర్వహణ కోసం ప్రతి ఊరికి ఒక డంపు యార్డును ఏర్పాటు చేసింది. 330 కోట్ల ఖర్చుతో కొత్త విద్యుత్ స్తంభాలను అమర్చింది. అన్ని గ్రామాల్లో ఎల్. ఈ. డీ వీధి దీపాలు ఏర్పాటు చేసింది. మొక్కల పెంపకం కోసం ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా నర్సరీలను ఏర్పాటు చేసింది. ఆహ్లాదకరమైన పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది.

49. పారిశుద్ధ్య నిర్వహణ కోసం గతంలో రాష్ట్రవ్యాప్తంగా 84 ట్రాక్టర్లు మాత్రమే ఉండేవి. ఈరోజు రాష్ట్రంలో 12,769 ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతీ గ్రామం ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీలను కలిగి ఉన్నది. పరిశుభ్రత పెరగడంతో ప్రజారోగ్యం మెరుగుపడింది. దోమలబాధ తగ్గింది. మలేరియా వ్యాప్తి తగ్గింది.

50. మరణించిన వారి అంత్యక్రియలు గౌరవప్రదంగా జరిగేందుకు ప్రభుత్వం 1547 కోట్ల భారీ వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించింది. ప్రతి నెలా గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం ప్రభుత్వం నేరుగా 227.5 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నది.

51. 'సన్సద్ ఆదర్శ గ్రామ యోజన' కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా గ్రామపంచాయతీలకు ప్రకటించిన తొలి పది ర్యాంకుల్లో ఏడు ర్యాంకులు తెలంగాణ గ్రామ పంచాయతీలే కైవసం చేసుకున్నాయి. ఇది పల్లె ప్రగతి సాధించిన అద్భుతమైన అభివృద్ధికి తార్కాణం.

గందగీ ముక్త్ భారత్ అవార్డుల్లో తెలంగాణ అత్యధిక శ్రమదానాలు నిర్వహించిన రాష్ట్రంగా ప్రథమ స్థానంలో నిలిచింది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సశక్తీకరణ్ అవార్డుల్లో సంగారెడ్డి జిల్లా పరిషత్తుతోపాటు కోరుట్ల, ధర్మారం మండల పరిషత్తులు, ఆరు గ్రామపంచాయతీలూ అవార్డులు అందుకున్నాయి.

52. కరోనా వల్ల దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఉపాధి అవకాశాలను కల్పించాలి. కానీ, దీనికి భిన్నంగా మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి యోజన నిధులలో 25 వేల కోట్ల రూపాయలు కోత పెట్టడం వల్ల గ్రామీణ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. కనుక కేంద్రం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతున్నాం.

ఈ వార్షిక బడ్జెట్లో పల్లె ప్రగతి ప్రణాళిక కోసం 3330 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

**పట్టణ ప్రగతి**

53. తెలంగాణ రాష్ట్రంలో పట్టణ జనాభాలో అత్యధిక పెరుగుదల నమోదవుతున్నది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రగతి ప్రణాళికాబద్ధంగా జరగాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుత అవసరాలే కాకుండా భవిష్యత్ అవసరాలను సైతం దృష్టిలో పెట్టుకొని కొత్త మున్సిపల్ చట్టాన్ని తెచ్చింది. పట్టణాలలో అభివృద్ధి కోసం "పట్టణ ప్రగతి" అనే కార్యక్రమం చేపట్టింది. మున్సిపాలిటీలకు ప్రతి నెల ఠంచన్‌గా నిధులు విడుదలవుతున్నాయి. ప్రతిఇంటికి నల్లా నీటిని అందించేందుకు అర్బన్ భగీరథ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పచ్చదనం పెంపుదల కోసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కోసం కేటాయిస్తున్నది.

54. టీఎస్ బీపాస్ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత పట్టణాల్లో ఇండ్ల నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం అయింది. స్థల విస్తీర్ణం 75 చదరపు గజాల వరకు ఉంటే, ఆ ఇంటి నిర్మాణానికి అనుమతి అవసరంలేదు. 500 చదరపు గజాల విస్తీర్ణం ఉన్న వారు స్వీయ ధృవీకరణతో సింగిల్ విండో ద్వారా ఆన్ లైన్ లో అనుమతులు పొందవచ్చు.

55. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలలో వెజ్ - నాన్ వెజ్ సమీకృత మార్కెట్ల నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు టీ. యూ. ఎఫ్. ఐ. డీ. సీ. నిధులు 3 వేలకోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. పట్టణాల్లో పేరుకుపోయిన లెగసీ వేస్టును బయో మైనింగ్ ద్వారా ఎరువుగా మార్చే ప్రక్రియను 123 మున్సిపాలిటీల్లో 276 కోట్లతో చేపట్టింది. గ్రామాలలో నిర్మించినట్టుగానే పట్టణాల్లో సైతం వైకుంఠధామాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది.

56. రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీల్లో పచ్చదనాన్ని పెంచేందుకు 1602 నర్సరీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఎల్.ఈ.డీ వీధి దీపాలను ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం 2021 లో ప్రదానం చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో తెలంగాణ మున్సిపాలిటీలు 12 అవార్డులను కైవసం చేసుకున్నాయి. ఈ వార్షిక బడ్జెట్లో పట్టణ ప్రగతి ప్రణాళికల కోసం 1394 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది

**విద్యారంగ అభివృద్ధి..**

57. విద్య ప్రపంచాన్ని మార్చే శక్తిమంతమైన ఆయుధం. విద్య కేవలం మార్కుల కోసం కాదు. సమూల మార్పుల కోసం అని తెలంగాణా ప్రభుత్వం విశ్వసిస్తున్నది. తెలంగాణాలో కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యాబోధన జరగాలని ఉద్యమ సమయంలోనే కేసీఆర్ గారు స్వప్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ స్వప్నాన్ని సాకారం చేసే

ప్రయత్నాన్ని ప్రారంభించారు. మొదటగా గురుకుల విద్యకు పెద్దపీట వేశారు.

58. ఆరు దశాబ్దాల సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతంలో నామమాత్రంగా కొన్ని గురుకుల పాఠశాలలు ఉండేవి. అవికూడా అరకొర వసతులతో ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే ఇదివరకు ఉన్న గురుకులాలను పటిష్ఠ పరిచి పెద్ద ఎత్తున నూతన గురుకులాలను స్థాపించింది. రాష్ట్రవ్యాప్తంగా 973 గురుకుల పాఠశాలల్లో తగిన వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నది.

59. మహిళలు విద్యావంతులు అయితే యావత్ జాతి విజ్ఞానవంతమవుతుందని నమ్మిన నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు. ముఖ్యంగా దళిత, గిరిజన విద్యార్థినులు చదువు మధ్యలో మానేయకూడదని ఆలోచించారు. అందుకని తెలంగాణ ప్రభుత్వం 46 మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఐదు మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులను ప్రవేశపెట్టింది. ఇంత పెద్ద ఎత్తున మహిళల కోసం రెసిడెన్షియల్ కాలేజీలను ఏర్పాటు చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ కృషిని 15వ ఆర్థిక సంఘం ప్రత్యేకంగా అభినందించింది.

60. తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు సన్నబియ్యంతో తిన్నంత భోజనం పెడుతోంది. ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు తదితర సౌకర్యాలను అందిస్తోంది.

61. ఈ దేశంలో అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. అంతర్జాతీయ విద్యాసంస్థలకు దీటుగా నేడు తెలంగాణాలోని గురుకులాలు విద్యను అందిస్తున్నాయి. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాల్లో మన రాష్ట్ర విజయకేతనాన్ని ఎగురవేస్తున్నారు. ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో ప్రవేశాలు సాధిస్తున్నారు.

**మన ఊరు - మన బడి / మన బస్తీ మన బడి**

62. గురుకుల విద్యకు మొదటి దశలో పెద్ద పీట వేసిన ప్రభుత్వం, రెండో దశలో ఇతర ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా దృష్టి కేంద్రీకరిస్తూ మన ఊరు- మన బడి అనే బృహత్తర పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధనను అందించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేదలకు ఆంగ్ల మాధ్యమం అందని ద్రాక్ష కాకూడదనీ, వారు కూడా మిగతా ప్రపంచంతో సమానంగా ఎదగాలనీ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంను ప్రవేశ పెడుతోంది.

63. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను పెద్ద ఎత్తున చేపడుతోంది. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే తయారవుతుందని కొఠారీ కమిషన్ పేర్కొన్నది. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల తరగతి గదులను ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నది.

64. రాష్ట్రవ్యాప్తంగా 7,289 కోట్ల రూపాయలతో దశలవారీగా పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతున్నది. ఇది గ్రామ స్థాయిలో అయితే మన ఊరు - మన బడి అనే పేరుతో, పట్టణాల్లో అయితే మన బస్తీ- మన బడి అనే పేరుతో అమలవుతుంది. మొదటి దశలో మండలాన్ని యూనిట్ గా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా 9,123 పాఠశాలల్లో 3,497 కోట్ల రూపాయలతో కార్యాచరణ ప్రారంభించింది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో తొలిదశ కార్యక్రమం అమలవుతుంది. అది అధికారపక్షానికి చెందిన నియోజకవర్గమా.. లేక ప్రతిపక్షానికి చెందిన నియోజకవర్గమా.. అనే వివక్ష చూపకుండా అన్ని మండలాల్లో, సమాన దృష్టితో మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.

65. పన్నెండు రకాల మౌలిక సదూపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. 1. డిజిటల్ విద్య అమలు, 2. విద్యుదీకరణ, 3.తాగునీటి సరఫరా, 4. సరిపడా ఫర్నీచర్, 5. పాఠశాలలకు మరమ్మతులు, 6. పాఠశాలలకు రంగులు వేయడం 7. గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు 8. ప్రహారీ గోడల నిర్మాణం 9. కిచెన్ షెడ్డుల నిర్మాణం 10. అదనపు తరగతుల నిర్మాణం 11. ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్ల నిర్మాణం 12. నీటి సౌకర్యంతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం. వీటితో పాటు అనేక రకాల సదుపాయాలను మన ఊరు- మన బడి ద్వారా

ప్రభుత్వం కల్పిస్తుంది. రాష్ట్రంలోని పాఠశాలలన్నింటినీ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతుంది.

66. ఉన్నత విద్యలో మహిళలు ముందంజలో ఉండాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో మొట్టమొదటి మహిళా విశ్వ విద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని శాసనసభకు తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. దీనికోసం ఈ ఆర్థిక సంవత్సరంలో వంద కోట్ల రూపాయలు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన నాటికి తెలంగాణలో ఒక్క ఫారెస్ట్ కాలేజీ కూడా లేదు. ఈ లోటును గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వెంటనే ములుగులో ఫారెస్ట్ కాలేజీని ఏర్పాటు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా అటవీ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో వంద కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

**వైద్యం- ఆరోగ్యం..**

**హైదరాబాద్ నలుదిక్కులా సూపర్‌స్పెషాలిటీ దవాఖానాలు..**

67. రాష్ట్రంలో వైద్య సేవలను మరింత విస్తరించాలని, పేదలకు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. T I M S (టిమ్స్) ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరం నలుదిక్కులా సూపర్ స్పెషాల్టీ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలని

తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని గచ్చిబౌలి, ఎల్బీనగర్, అల్వాల్, ఎర్రగడ్డలలో ఏర్పాటు చేయనుంది. ప్రతి హాస్పిటల్‌లో వెయ్యి పడకల చొప్పున నాలుగు వేల పడకలతో నాలుగు సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా చేయబోతున్నది. అదే విధంగా నిమ్స్ హస్పిటల్ లో మరో రెండు వేల పడకలను ప్రభుత్వం పెంచబోతున్నది. దీంతో నిమ్స్ లో మొత్తం 3489 పడకలు అందుబాటులోకి వస్తాయి.

**వరంగల్ లో హెల్త్‌సిటీ..**

68. వరంగల్ లో హెల్త్ సిటీని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఇప్పటికే కాళోజీ నారాయణ రావు వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. వరంగల్ నగరంలో అధునాతనమైన వసతులతో కొత్తగా రెండు వేల పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. 24 అంతస్తులతో నిర్మించబోయే ఈ ఆసుపత్రి కోసం 11 వందల కోట్లు వెచ్చించనుంది. ఇందులో 35 సూపర్‌స్పెషాలిటీ విభాగాలు ఉంటాయి. గుండె, కిడ్నీ, కాలేయం తదితర అవయవ మార్పిడి ఆపరేషన్లతోపాటు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన కీమోథెరపీ, రేడియేషన్ వంటి అత్యాధునిక చికిత్సలూ ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయి.

**ప్రతి జిల్లాకో వైద్య కళాశాల**

69. 60 ఏళ్ల సమైక్య రాష్ట్ర చరిత్రలో తెలంగాణలో ఏర్పాటయిన ప్రభుత్వ వైద్య కళాశాలలు కేవలం మూడంటే మూడే. ఉస్మానియా, గాంధీ హాస్పిటళ్లు ఉమ్మడి రాష్ట్రం ఏర్పడేకన్నా ముందు నుంచే ఉన్నాయి. టి.ఆర్.ఎస్. ప్రభుత్వం ఏడున్నర ఏళ్లలో పన్నెండు కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలోని వైద్యకళాశాలల సంఖ్య పదిహేడుకు పెరిగింది. తెలంగాణ రాష్ట్రం రావడం వల్ల, కేసీఆర్ గారి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటం వల్లనే వైద్య కళాశాలల సంఖ్యను ఇంతగా పెంచుకోగలిగామని సవినయంగా తెలియజేస్తున్నాను.

70. రాష్ట్రం ఏర్పడగానే మొదటివిడతగా ప్రభుత్వం 4 కొత్త వైద్య కళాశాలలు మహబూబ్ నగర్ , నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేటలో ప్రారంభించింది. ఈ కళాశాలల్లో వైద్య విద్యా బోధన విజయవంతంగా జరుగుతున్నది. వీటిలో పీజీ కోర్సులు సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం మరో 8 వైద్య కళాశాలలను మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్ కర్నూల్, మహబూబాబాద్, కొత్తగూడెం, సంగారెడ్డి లకు ప్రభుత్వం మంజూరు చేసింది. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే విధంగా అన్నిచర్యలు తీసుకుంటున్నది. శరవేగంగా భవనాల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతున్నది.

71. రాష్ట్ర ప్రజలకు మరో శుభవార్తను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. రాబోయే రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు నిర్ణయించారు. ఈ సంవత్సరం కొత్తగా ఎనిమిది వైద్యకళాశాలలను, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, సిరిసిల్ల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం జిల్లాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. 2023 సంవత్సరంలోని రాష్ట్రంలోని మిగతా ఎనిమిది జిల్లాలైన మెదక్, మేడ్చల్, రంగారెడ్డి, ములుగు, వరంగల్, నారాయణపేట, గద్వాల, యాదాద్రిల్లో మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. నూతన మెడికల్ కాలేజీల స్థాపన కోసం ఈ బడ్జెట్‌లో వెయ్యికోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

**బస్తీ దవాఖానాలు..**

72. గతంలో నగరంలోని బస్తీలలో వైద్య సౌకర్యాలేవి ఉండేవి కావు. పేదలు విధి లేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించవలసి వచ్చేది. ఈ పరిస్థితిని మార్చేందుకు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు హైదరాబాద్ లో 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం 256 బస్తీ దవాఖానాలు సేవలందిస్తున్నాయి. వీటిలో వైద్య సేవలతో పాటు 57 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. తమ ముంగిట్లోకి ఆసుపత్రులు రావడంతో బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చీటికిమాటికి ప్రైవేటు ఆసుపత్రులకు పోవాల్సిన బెడద తప్పిందని సంతోషపడుతున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో మరో 94 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. నగరంలోని బస్తీ దవాఖానాలకు వస్తున్న స్పందనను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మరో 60 బస్తీ దవాఖానాలను కొత్తగా ప్రారంభించనున్నది. బస్తీ దవాఖానాలు అందిస్తున్న సేవలను గుర్తించిన పదిహేనో ఆర్థిక సంఘం తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ తరహా దవాఖానలు ఇతర రాష్ట్రాలలోను ఏర్పాటు చేయాలని సూచించింది.

73. ఇటీవల రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వైద్యరంగంలో తెలంగాణ చేస్తున్న కృషిని ప్రశంసించింది. వైద్య సేవల మీద ఎక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని వెల్లడించింది. వైద్య సేవల కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న తలసరి ఖర్చు 1698 రూపాయలు. ఆరోగ్య రంగంలో అత్యధికంగా తలసరి ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉన్నది.

**దవాఖానాల్లో మౌలిక వసతుల అభివృద్ధి..**

74. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని దవాఖానలన్నింటిలో మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసింది. వైద్య పరీక్షల పరికరాలు, మందులు తదితర సౌకర్యాలన్నీ అందుబాటులోకి తెచ్చింది. అన్ని జిల్లా కేంద్రాల్లో 'తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాలు' ఏర్పాటు చేసింది. ఈ

కేంద్రాలు 57 కు పైగా పరీక్షలను ఉచితంగా చేస్తున్నాయి. కిడ్నీ రోగులకు వైద్యం కోసం రాష్ట్రంలో 42 ఉచిత డయాలసిస్ కేంద్రాలను, వాటిలో 313 డయాలసిస్ మిషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో మరిన్ని డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మిషన్ల సంఖ్యను అవసరానికి అనుగుణంగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. డయాలసిస్ కేంద్రాలకు రోగులు వచ్చిపోవడానికి ఆర్టీసీ ఉచిత బస్ పాస్ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో 14 చోట్ల సీటీ స్కాన్, ఎం.ఆర్.ఐ. పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ తో పాటు ఖమ్మం. వరంగల్, ఆదిలాబాద్ లలో 'క్యాథ్ ల్యాబ్' సేవలు అందుబాటులో వచ్చాయి. ఈ ల్యాబ్‌లలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.

75. ప్రభుత్వ హాస్పిటళ్లలో రోగులకు చికిత్సతోపాటు పోషకాహారాన్ని అందించాలనీ, ఇందుకోసం డైట్ చార్జీలను రెట్టింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీ.బి., క్యాన్సర్ తదితర రోగులకు బలవర్ధకమైన ఆహారం అందించడం కోసం బెడ్ ఒక్కింటికి ఇచ్చే డైట్ చార్జీలను 56 రూపాయల నుంచి 112 రూపాయలకు పెంచాలనీ, సాధారణ రోగులకు ఇచ్చే డైట్ చార్జీలు బెడ్ ఒక్కింటికి 40 రూపాయల నుంచి 80 రూపాయలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వం ప్రతి ఏటా 43.5 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నది.

76. హైదరాబాద్ లోని 18 మేజర్ ప్రభుత్వ హాస్పిటళ్లలో రోగితో ఉండే సహాయకులకు కూడా సబ్సిడీ పై భోజన సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. రెండు పూటలా వారికి ఈ భోజనం అందుతుంది. ప్రతి రోజు సుమారు 18,600 మందికి ఈ ప్రయోజనం కలుగుతుందని అంచనా వేస్తోంది. దీని కోసం సంవత్సరానికి 38.66 కోట్లు ఖర్చవుతాయి.

77. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య ప్రమాణాలను పెంచడం కోసం, పారిశుద్ధ్య కార్మికులకు, ఇతర సిబ్బందికి వేతనాలు పెంచాలని ముఖ్యమంత్రి గారు సహృదయంతో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బెడ్ ఒక్కింటికి చేసే పారిశుద్ధ్య ఖర్చును 5000 నుంచి 7500 రూపాయలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నది. ఇందు కోసం ప్రభుత్వం 338 కోట్ల రూపాయలను ప్రతి సంవత్సరం వెచ్చించనుంది. పేదల అవసరాల విషయంలో ముఖ్యమంత్రి గారు సదా మానవీయ హృదయంతో స్పందిస్తారనడానికి పై నిర్ణయాలే సాక్ష్యం.

**మార్చురీల ఆధునికీకరణ...**

78. మృతదేహాలను భద్రపరిచేందుకు, పోస్టుమార్టం నిర్వహించేందుకు ఉపయోగించే మార్చురీలను ఆధునీకరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా 61 మార్చురీల ఆధునీకరణకు 32 కోట్ల 50 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది.

79. ఆరోగ్యశ్రీ ద్వారా అందించే సేవల పరిమితి గతంలో 2 లక్షలు మాత్రమే ఉండేది. ఇప్పుడా పరిమితిని తెలంగాణ ప్రభుత్వం 5 లక్షలకు పెంచింది. ప్రత్యేకంగా హార్ట్, లివర్, బోన్‌మారో వంటి అవయవ మార్పిడి చికిత్సల కోసం ఆరోగ్య శ్రీ ద్వారా పది లక్షల వరకు ఇస్తుంది. దీనివల్ల రాష్ట్రంలోని పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

80. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఎం.సీ.హెచ్. హాస్పిటల్స్ ను 407 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. యునిసెఫ్ సూచించిన ప్రమాణాల ప్రకారం లేబర్ రూంలను ఆధునీకరించింది.

81. రాష్ట్రంలో 300 అమ్మ ఒడి వాహనాల ద్వారా మారుమూల పల్లెల నుంచి గర్భిణి స్త్రీలను దవాఖానాలకు తరలించే ఏర్పాటు చేసింది. హై రిస్క్ ప్రెగ్నెన్సీని గుర్తించడంలోనూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడంలోనూ తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. బాలింత మరణాల తగ్గుదల రేటులోనూ తెలంగాణ ముందు వరుసలో ఉంది.

**సమర్థవంతంగా కరోనా కట్టడి.**

82. కరోనా కట్టడి కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రశంసించింది. దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలోని అన్ని పడకలను ఆక్సిజన్ పడకలుగా మార్చింది.

పీడియాట్రిక్ ఐ.సి.యు.లను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 135 టన్నుల నుంచి 550 టన్నులకు పెంచేందుకు చర్యలు తీసుకున్నది.

83. రాష్ట్రంలో నిర్వహించిన జ్వర సర్వే సత్ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ సిబ్బంది ప్రజల ఇంటి వద్దకు వెళ్లి కరోనా పరీక్షలను నిర్వహించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయితే వారికి కరోనా కిట్లను అందించారు. అవసరమైనవారిని ఆస్పత్రులకు తరలించి వైద్యం చేయించారు. నీతి ఆయోగ్ గత ఏడాది విడుదల చేసిన నివేదికలో జ్వర సర్వేను బెస్ట్ ప్రాక్టీసుగా ప్రకటించింది. వైరస్ వ్యాప్తిని ప్రాథమిక దశలోనే కట్టడి చేసేందుకు ఇది సరైన పద్ధతి అని పేర్కొన్నది. దీనివల్ల ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గిందని ప్రశంసించింది.

84. వైరస్‌వ్యాప్తిని ఎదుర్కోవడంలో పటిష్టమైన కార్యాచరణను అమలు చేసిన మూడో అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణాను ఎకనమిక్ సర్వే గుర్తించింది. కరోనా వాక్సినేషన్ ప్రక్రియలో సైతం తెలంగాణ జాతీయ సగటు కన్నా ముందుంది.

**వ్యవసాయ సమృద్ధితో అన్నపూర్ణగా తెలంగాణ...**

85. తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషితో వ్యవసాయరంగం కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రగతిని సాధించింది. సస్యశ్యామల తెలంగాణ సాకారం

అయ్యింది. నేడు రాష్ట్రంలో ఊహకందని రీతిలో వ్యవసాయోత్పత్తి పెరిగింది.

86. ఎంత పంట పెరిగిందంటే, మోసేందుకు హమాలీలు చాలడం లేదు. జోకేందుకు కాంటాలు సరిపోవడం లేదు. రాసుల కొద్దీ పంట మార్కెట్లకు తరలి వస్తున్నది.

87. ఉమ్మడి రాష్ట్రంలో 10 సంవత్సరాల్లో వ్యవసాయ శాఖ తెలంగాణ ప్రాంతంలో ఖర్చు చేసిన నిధుల మొత్తం 7,994 కోట్లు మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటి వరకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 83,989 కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ రాష్ట్రం రావడం వల్ల, టి.ఆర్.ఎస్. ప్రభుత్వం ఏర్పడడం వల్లనే వ్యవసాయ శాఖ ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేయడం జరిగింది.

**రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం..**

88. 2014-15లో తెలంగాణ ప్రాంత సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు కాగా, అది 2020-2021 నాటికి 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది. 2014-15లో 68.17 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి ఉండగా 2020-21 నాటికి 218.51 లక్షల టన్నులకు ఉత్పత్తి పెరిగింది. నేడు తెలంగాణ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా అవతరించింది.

**రైతు బంధు..**

89. ఎవరు కల కననిది, ఎవరి ఊహకు అందనిది, ఎవరు దరఖాస్తు పెట్టి అడగనిది, ధర్నాలు చేసి డిమాండ్ చేయనిది, ఏ ఎన్నికల మేనిఫెస్టోల్లో చెప్పనిది, కేసీఆర్ గారు తానే ఒక రైతుగా, రైతు బిడ్డగా ఆలోచించి ప్రవేశపెట్టిన మహత్తరమైన పథకం రైతుబంధు. రైతు బంధు పథకం దేశంలోని సంక్షేమ పథకాలన్నింటిలో తలమానికంగా నిలిచింది. పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు రైతుబంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకున్నాయి. కేంద్రం కూడా ఈ పథకాన్ని అనుసరించింది.

90. ఐక్యరాజ్యసమితి రైతుబంధు పథకాన్ని ఎంతగానో ప్రశంసించింది. ప్రముఖ వ్యవసాయార్థిక నిపుణులు అరవింద సుబ్రమణియన్, అశోక్ గులాటీ వంటి వారెందరో ఈ పథకాన్ని కొనియాడారు.

91. పంట కాలంలో ప్రతి రైతుకూ ఎకరానికి సాలీనా రూ.10వేల చొప్పున పెట్టుబడి సహాయం ప్రభుత్వమే అందజేయడంతో రైతులు నిరంధిగా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారు. అప్పుల ఊబిలో నుంచి బయటపడ్డారు. ఇప్పటి వరకు రైతుబంధు పథకం ద్వారా గడిచిన ఎనిమిది సీజన్లలో 50,448 కోట్ల రూపాయలను 63 లక్షల మంది రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఏ పాలకుడూ ఎన్నడూ రైతులకు ఇంతగా సాయం చేసిన చరిత్రే లేదు. రైతుబంధు పథకం ద్వారా 50వేల

కోట్లను అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం రైతుబంధు వారోత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

**రైతుబీమా :**

92. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమంతోపాటు వారి కుటుంబాల సంక్షేమం కోసం కూడా పాటుపడుతోంది. ఏ కారణంగానైనా రైతు మరణిస్తే అతని కుటుంబం ఆగమైపోవద్దని రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో అరగుంట భూమి ఉన్న రైతుకు కూడా అయిదు లక్షల రూపాయల ఉచిత బీమాను అందజేస్తోంది. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది.

93. గత ప్రభుత్వాలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కొద్దిపాటి పరిహారాన్ని చెల్లించేవి. ఆ పరిహారం కోసం రైతుల కుటుంబసభ్యులు పడరాని పాట్లు పడేవారు. కంట్లో నీళ్లు కుక్కుకొని, దరఖాస్తు చేతపట్టుకొని, పిల్లా జెల్లను వెంటపెట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం మాత్రం ఉండేది కాదు. ఒక ఎమ్మెల్యేగా నేను ఆ దుఃఖాన్నంతా దగ్గర నుంచి చూసిన.

94. రైతు బీమా అమలులోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రైతు కుటుంబసభ్యులు ఎవ్వరూ గడపదాటాల్సిన అవసరం లేదు. దరఖాస్తు పెట్టుకోవాల్సిన అగత్యం లేదు. మరణించిన రైతు దినవారాలు పూర్తయ్యేలోపుగానే 5 లక్షల రూపాయలు కుటుంబానికి

అందుతున్నాయి. ఇప్పటి వరకు 75వేల కుటుంబాలకు 3,775 కోట్ల రూపాయలను ప్రభుత్వం అందజేసింది. ఇదీ కేసీఆర్ మార్క్ మానవీయ పరిపాలన.

95. వ్యవసాయం, దాని అనుబంధ శాఖలతో కూడిన ప్రాథమిక రంగంలో 2013-2014 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో వ్యవసాయ వృద్ధిరేటు 4.0 శాతం మాత్రమే ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల చర్యల వల్ల 2019-20 నాటికి వ్యవసాయ వృద్ధి రేటు 29 శాతానికి పెరిగింది. సమైక్య రాష్ట్రంలో శాపగ్రస్తమైన వ్యవసాయం నేడు రైతాంగం పాలిట వరంగా మారింది.

96. రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రాష్ట్రం వచ్చే నాటికి 18.45 లక్షల టన్నులుగా ఉన్న ఉత్పత్తి ప్రస్తుతం 31.60 లక్షల టన్నులకు పెరిగింది. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే పత్తికి నాణ్యమైన పత్తి అనే పేరుండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

97. సమైక్య రాష్ట్రంలో ఎరువులు విత్తనాల కోసం రైతులు అనుభవించిన కడగండ్లు తల్చుకుంటే, ఇప్పటికీ కండ్లల్ల నుంచి నీళ్లు కాదు.. నెత్తురు కారుతుంది. ఎరువులను పోలీసు స్టేషన్లలో పెట్టి అమ్మిన దుర్మార్గ చరిత్రనూ సమైక్య రాష్ట్రంలో చూశాం. రైతులు తమ చెప్పులు లైన్లలో పెట్టి రోజుల తరబడి ఎదురు చూసే పరిస్థితి అప్పుడు ఉండేది. ఎరువులు అమ్మేచోట రైతాంగం వీపులపై లాఠీలు విరగడం ఆనవాయితీగా మారిందంటే ఆనాటి రైతాంగం కష్టాలు ఊహించుకోవచ్చు.

శాసనసభ్యుడిగా నేను కూడా ఎన్నోసార్లు రైతుల తరఫున ఆనాటి ప్రభుత్వంతో ఘర్షణ పడ్డాను.

98. వ్యవసాయానికి అయిదు గంటలు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయమని రైతులు ఎంతమొత్తుకున్నా సమైక్య రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వలేకపోయాయి. కరెంటు కోతలకు తోడు, కరెంటు బిల్లులు పెంచి సమైక్యపాలకులు రైతాంగాన్ని మరింత కష్ట పెట్టారు. ఇదేమిటని అడిగినందుకు కాల్చిచంపారు. ఆనాడు రైతులు కార్చిన కన్నీటిలోంచి తెలంగాణ ఉద్యమం ఉద్భవించింది. అది ఉప్పెనగా మారి సమైక్యపాలనకు చరమగీతం పాడింది.

99. తెలంగాణ ఏర్పడగానే ప్రభుత్వం వ్యవసాయ శాఖను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. రాష్ట్రాన్ని వ్యవసాయ క్లస్టర్లుగా విభజన చేసి, ప్రతీ క్లస్టర్ కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమింపజేసింది. ఇందుకోసం కొత్తగా 2601 మంది ఏఈవోలను నియమించింది.

**పంట రుణాల మాఫీ..**

100. తెలంగాణ ఏర్పడిన తర్వాత 35.32 లక్షల మంది రైతులకు చెందిన 16,144 కోట్ల రూపాయల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ దఫా రుణమాఫీలో భాగంగా ఇప్పటి వరకు 5.12 లక్షల మంది రైతులకు సంబంధించిన రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. 50

వేల రూపాయాలలోపు రుణాలు ఈ మార్చిలోపు మాఫీ అవుతాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 75 వేల లోపు ఉన్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

**ఆయిల్ పామ్ సాగు..**

101. దేశంలో పామాయిల్ డిమాండ్ చాలా ఉంది. భారత దేశం 80 వేల కోట్ల రూపాయల పామాయిల్‌ను ఏటా దిగుమతి చేసుకుంటున్నది. సాగునీటి వసతి పెరిగిన తర్వాత పామాయిల్ సాగుకు తెలంగాణ ఎంతో అనువుగా మారింది. పామాయిల్‌సాగు చాలా సులభతరం. చీడపీడల బాధ ఉండదు. కోతులు, అడవి పందుల బెడద ఉండదు. పామాయిల్‌సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం గడిస్తున్నారు. అందుకనే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విస్తృతంగా పామాయిల్ సాగును ప్రోత్సహిస్తోంది.

102. 2022-23 సంవత్సరంలో వెయ్యి కోట్లతో 2.5 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. దేశంలో ఇంత పెద్ద ఎత్తున పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. తెలంగాణ రైతులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం కోరుతున్నది.

103. రైతుల సమావేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2601 రైతు వేదికలను 572 కోట్ల ఖర్చుతో నిర్మించింది. రైతులకు ఈ విధమైన సదుపాయం దేశంలోని మరే రాష్ట్రం కల్పించ లేదు.

104. వ్యవసాయరంగం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దేశవ్యాప్తంగా వ్యతిరేకతను మూటకట్టుకుంటున్నాయి. వ్యవసాయ సంస్కరణల పేరుతో కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఉన్నాయని రైతాంగం పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లక్షలాది రైతులు దేశ రాజధానిలో ఏడాదిన్నర కాలం పాటు ఎండా, వాన, చలి దేన్ని లెక్క చేయకుండా ఆందోళన చేసిన విషయం తెల్సిందే. రైతుల పోరాటానికి తలొగ్గి కేంద్రం తాను తెచ్చిన చట్టాలను ఉపసంహరించుకోవడంతోపాటూ దేశంలోని రైతులకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

105. ఇంత జరిగినా కేంద్రం తన వైఖరిన మార్చుకోవడంలేదు. ఇటీవలి బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీపై 35 వేల కోట్లు కోత విధించింది. దీనివల్ల కొన్నిరకాల ఎరువుల ధరలు అదుపు తప్పే ప్రమాదం ఉన్నది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా రైతాంగం ఇప్పటికే ఆందోళన పడుతోంది. ఇది చాలదన్నట్టు ఎరువుల ధరలు కూడా పెరిగితే మోయలేని భారం పడుతుంది.

106. కేంద్రం వైఖరి రైతులకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడటం లేదు.

ప్రభుత్వ కృషితో వ్యవసాయ రంగంలో వచ్చిన అభివృద్ధి వల్ల తెలంగాణ గ్రామీణ జీవన ముఖచిత్రం మారిపోయింది. రాష్ట్రం నుంచి వలసలు ఆగిపోయాయి. పనుల కోసం ఇతర రాష్ట్రాల కూలీలు తెలంగాణాకు వలసలు వస్తున్నారు.

107. ఏడాదికి రెండు-మూడు పంటలు చేతికి వస్తుండడంతో రైతుల్లో ఆత్మ విశ్వాసం పెరిగింది. గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. నూతన ఉపాధి అవకాశాలు పెరిగాయి. గ్రామాల్లో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, జేసీబీలు, డోజర్ల సంఖ్య పెరిగిపోయింది. వ్యవసాయ సమృద్ధితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యింది. రాష్ట్ర జీ ఎస్ డీ పీలో 20 శాతం ఆదాయం వ్యవసాయం నుంచే సమకూరుతుందంటే తెలంగాణ గ్రామీణ జీవితం ఎంతగా మారిపోయిందో ఊహించవచ్చు. వ్యవసాయ రంగానికి ఈ వార్షిక బడ్జెట్‌లో 24,254 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం

**నీటిపారుదల రంగ అభివృద్ధి..**

108. మట్టికైనా.. మానుకైనా.. మనిషికైనా జీవం పోసేది నీళ్లే. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నీళ్ల కోసం అనుభవించిన గోస మాటలకు అందనిది. మలి దశ తెలంగాణ పోరాట నినాదమే 'నీళ్లు-నిధులు- నియామకాలు'. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తెలంగాణ నీటి ఆర్తిని తీర్చడాన్ని ఒక తపస్సులా భావించారు. ఏడున్నరేళ్లలో ఎవరూ ఊహించని

అద్భుతాలను ఆవిష్కరించారు. సాగు నీటి రంగ చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించారు.

109. తెలంగాణాలో 2014 నాటికి 20 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉండేది. 2021 నాటికి తెలంగాణ ప్రభుత్వం 85.89 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగించింది. చిత్తశుద్ధి, పట్టుదల ఉంటే కానిది లేదు అని అనడానికి సాగు నీటి రంగంలో తెలంగాణ సాధించిన అభివృద్ధే నిదర్శనం.

110. రాష్ట్రంలోని అన్ని సాగు నీటి వ్యవస్థలు - ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, చెక్ డ్యాంలు, ఆనకట్టలు , కత్వలు, చిన్న, పెద్ద లిఫ్ట్ స్కీంలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సాగు నీటి శాఖను పునర్ వ్యవస్థీకరించారు. ప్రాజెక్టుల నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి నిర్వహణాపరమైన అంశాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించింది.

**మిషన్ కాకతీయ...**

111. శతాబ్దాలుగా తెలంగాణ వ్యవసాయానికి ఆదరవుగా ఉన్న చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో పెద్ద ఎత్తున చేపట్టింది. 5,350 కోట్లు వెచ్చించి చెరువులను, చెక్‌డ్యాంలను పునరుద్ధరించింది. వీటి కింద 15.05 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించింది. చెరువుల్లో నిలువ సామర్థ్యం పెరిగింది.

దీంతో చేపల పెంపకం ఊపందుకుంది. ఈ చెరువులన్నింటిని ప్రాజెక్టుల కాలువలతో అనుసంధానం చేసింది.

112. నదులపై, వాగులపై రెండు దశలలో, 3,825 కోట్లతో 1200 చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టింది. మొదటిదశలో చేపట్టిన 650 చెక్ డ్యాంల పనులు పూర్తి కావస్తున్నాయి. రెండో దశ పనులు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తిచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

113. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, దేవాదుల తదితర పెండింగ్ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది. వీటి ద్వారా దాదాపు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టులు పూర్తి కావడంతో పాలమూరుతో పాటు ఎన్నో ప్రాంతాలు పచ్చబడ్డాయి. వలసలు ఆగిపోయాయి.

114. పాలమూరు రంగారెడ్డి జిల్లాల సాగునీటి అవసరాలను పూర్తిగా తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును 35వేల 200కోట్లతో చేపట్టింది. 70 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కొరత రాకుండా ఉండేందుకు కాళేశ్వరం కార్పొరేషన్‌తో అనుసంధానం చేసింది. ఇప్పటి వరకు దాదాపు 18,500 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల, పంపుహౌజుల పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి

ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అయిదు లక్షల ఎకరాలకు, ఉమ్మడి నల్గొండ జిల్లాలో 30వేల ఎకరాలకు మొత్తం 12.30 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి తీరుతుంది. దారిపొడుగునా ఉండే సుమారు వెయ్యికి పైగా గ్రామాలకు తాగునీరు అందిస్తుంది.

నల్గొండ జిల్లాలో కరవు ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండలతో పాటు అచ్చంపేట, కల్వకుర్తిల్లోని అయిదు మండలాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు 6,190 కోట్లతో ఆర్.విద్యాసాగర్ రావు - డిండి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది.

ప్రతిఘాతక శక్తులు ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేసులు వేయడం వల్ల ప్రాజెక్టు పనులకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. ఏది ఏమైనా ఈ ఏడాదిలోనే పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉన్నది.

115. దేవాదుల, సీతారామ, సీతమ్మ సాగర్, చనాక - కొరాట ఎత్తిపోతల పథకాల పనులు చురుగ్గా సాగుతున్నాయి. వార్ధా బ్యారేజీ, కుప్టి, చెన్నూరు ఎత్తిపోతల పథకాలు, నల్లగొండ ఎత్తిపోతల పథకాలు, గద్వాల జిల్లాలోని గట్టు ఎత్తిపోతల పథకం, వికారాబాద్ రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించబోతున్నాం.

116. సమ్మక్క సారక్క బ్యారేజీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నది. దీంతో దేవాదుల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు సమృద్ధిగా సాగు, తాగునీరు లభిస్తుంది.

117. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం దేశ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం. ఈ ప్రాజెక్టులో భాగమైన అన్నపూర్ణ, రంగనాయక సాగర్, కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయ్యింది. వాటితో ఆయా ప్రాంతాలకు సాగునీరు లభిస్తోంది. సాధారణంగా రిజర్వాయర్ల నిర్మాణం నదీ మార్గంలో జరుగుతుంది. కానీ, దీనికి భిన్నంగా నదీ, వాగు ఏదీ లేని చోట అతి పెద్ద రిజర్వాయర్ మల్లన్న సాగర్ నిర్మాణం కావడం సాగునీటి రంగ చరిత్రలోనే ఒక అద్భుతం.

118. ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో దేశంలోకెల్లా అతిపెద్దదైన రిజర్వాయర్ మల్లన్నసాగర్‌ను ఫిబ్రవరి 23న ముఖ్యమంత్రి గారు స్వహస్తాలతో ప్రారంభించారు. 50 టీ.ఎం.సీ.ల నిల్వ సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్, గోదావరి బేసిన్‌లో శ్రీరాంసాగర్ తర్వాత అతిపెద్ద రిజర్వాయర్ కావడం విశేషం. దీని నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రతిఘాతక శక్తులు అనేక ఆటంకాలు సృష్టించాయి. నిర్మాణం కానే కాదన్నారు.. నీళ్లు రానే రావన్నారు. కోర్టుల్లో 350కు పైగా కేసులు వేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సంకల్ప బలం ముందు ఈ కుట్రలు నిలువలేకపోయాయి. ఉప్పొంగి వచ్చిన గోదావరి జలాలు మల్లన్నసాగర్‌లోకి ప్రవేశించాయి. మల్లన్న

సాగర్ గోదావరి జలాలతో కొమురెల్లి మల్లన్న పాదాలను ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అభిషేకించారు.

119. సంగారెడ్డి జిల్లాలో మూడు లక్షల తొంభై వేల ఎకరాలకు సాగు నీరందించే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం ఈ మధ్యనే శంకుస్థాపన చేసింది. దీనివల్ల తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలైన నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి.

120. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలతో పాటూ, కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్యాకేజీ పనులను ప్రభుత్వం త్వరితగతిన జరుపుతోంది.

121. తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి ఏ తోడ్పాటు లభించడం లేదు. ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. ఈ మధ్యే కేంద్రం బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని కెన్ బెత్వా ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది. కర్ణాటకలోని అప్పర్‌భద్రకు ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నది. కానీ, తెలంగాణ ప్రాజెక్టులకు మాత్రం జాతీయ హోదా ఇవ్వడంలేదు.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చడానికి అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం సెక్షన్ 3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి

ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చడం లేదు కానీ తెలంగాణ ప్రాజెక్టులను మాత్రం కృష్ణాబోర్డు పరిధిలోకి తెస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. అంటే కేంద్రం రాష్ట్రానికి అనుకూలమైందేమో చేయదు, ప్రతి కూలమైంది మాత్రం వెంటనే చేస్తుంది.

122. గోదావరి ప్రాజెక్టుల డి.పి.ఆర్.లను కేంద్ర జలసంఘానికి సమర్పించి అయిదు నెలలు గడుస్తున్నాయి. క్లియరెన్స్‌ల ప్రక్రియ పూర్తికావడంలేదు. కేంద్రం వెంటనే అన్ని క్లియరెన్స్‌లు త్వరితగతిన ఇవ్వాలని సభాముఖంగా కోరుతున్నాను. గోదావరి ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వలేదు కానీ, కేంద్ర బడ్జెట్ లో గోదావరి- కావేరి అనుసంధానం గురించి ప్రస్తావించడం విడ్డూరం. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరకం.

123. ఎవరు మోకాలడ్డినా ముఖ్యమంత్రి గారి సంకల్ప బలం మాత్రం చెక్కుచెదరదు. ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చింది. ఈ కృషిని ఇదే పట్టుదలతో కొనసాగిస్తామనీ, ఈ శాసనసభ ద్వారా ప్రభుత్వం హామీ ఇస్తున్నది.

**విద్యుత్తు రంగం...**

124. కరెంటు కష్టాలకు చరమగీతం పాడిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రకెక్కింది. 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్‌ను అన్ని రంగాలకు

అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. సమైక్య రాష్ట్రంలో కరెంటు కోతలతో తల్లడిల్లిపోయిన తెలంగాణ నేడు వెలుగు జిలుగుల రాష్ట్రంగా మారింది. చరిత్రలో అనేక మంది ముఖ్యమంత్రులు అధికారపీఠాన్ని ఎక్కారు, దిగారు. కానీ వారెవ్వరు కరెంటు సమస్యను పరిష్కరించలేకపోయారు. అది ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ గారి వల్లే సాధ్యమయ్యింది. ఎందుకంటే ఆయన రైతుబిడ్డ కనుక, రైతు పక్షపాతి కనుక.

125. విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ, సరఫరా రంగాల్లో నాటికి నేటికి హస్తిమశకాంతరం తేడా ఉంది. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యం కేవలం 7,778 మెగావాట్లు మాత్రమే. తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా నేడు మన రాష్ట్రం కలిగి ఉన్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 17,305 మెగావాట్లు.

126. తలసరి విద్యుత్తు వినియోగ వృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్. 2014లో తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1110 యూనిట్లు. ఇప్పుడు 2021 నాటికి 2012 యూనిట్లకు చేరుకున్నది. జాతీయ తలసరి విద్యుత్తు వినియోగంతో పోలిస్తే మన రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 73 శాతం అధికంగా ఉంది. ఇది రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే అద్భుతమైన సూచిక.

127. తెలంగాణ ఏర్పడినపుడు కేవలం 74 మెగావాట్ల సోలార్ విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయ్యేది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తవుతున్న

సోలార్ విద్యుత్తు 4431 మెగావాట్లు. రాబోయే రెండేళ్లలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి 7వేల మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉంది.

128. తెలంగాణ ప్రభుత్వం భద్రాద్రి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణం పూర్తి చేసి, ఉత్పత్తిని ప్రారంభించింది. మొత్తం నాలుగు యూనిట్ల నుంచి 1080 మెగావాట్ల విద్యుత్తు నిరంతరాయంగా ఉత్పత్తి చేస్తోంది.

129. నల్గొండ జిల్లాలో టీఎస్ జెన్కో నిర్మిస్తున్న యాదాద్రి అల్ట్రా మెగా ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2023 సంవత్సరానికి ఈ విద్యుత్తు కేంద్రం అందుబాటులోకి వస్తుంది. తెలంగాణ రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరిస్తుంది.

130. గత మార్చిలో రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ గరిష్టంగా 13,688 మెగావాట్లకు చేరింది. రాబోయే రోజుల్లో 17వేల మెగావాట్ల డిమాండ్ వచ్చినా విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా పంపిణీ, సరఫరా వ్యవస్థలను ప్రభుత్వం పటిష్టం చేసింది. ఇందు కోసం 34,970 కోట్లు ఖర్చు చేసింది.

131. గతంలో పవర్ హాలిడేలతో కునారిల్లిన పరిశ్రమలు నేడు 24 గంటల విద్యుత్తుతో మూడు షిఫ్టులు పని చేస్తున్నాయి. కార్మికులకు నిరంతర ఉపాధి లభిస్తున్నది.

132. గ్రేటర్ హైదరాబాద్ కు నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశానుసారం 400 కె.వి. 220 కె.వి. సరఫరా వ్యవస్థను ప్రభుత్వం పటిష్ఠ పరిచింది. దీని వల్ల రాష్ట్ర రాజధాని ప్రాంతంలో క్షణ కాలం కూడా విద్యుత్తు అంతరాయం ఏర్పడదు.

**మిషన్ భగీరథ**

133. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఐదేళ్లలోనే తాగు నీటి కష్టాలను తీర్చేస్తానని, లేని పక్షంలో ఓట్లు అడగనని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు శపథం చేశారు. మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించి, రాష్ట్రంలోని అన్ని ఆవాసాలకు, ఇంటింటికీ నల్లాల ద్వారా పరిశుద్ధమైన, సురక్షితమైన ఉపరితల జలాలు సరఫరా అయ్యేలా చేసారు.

134. రాష్ట్రంలో ఫ్లోరైడ్ సమస్య అంతమైంది. 70 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీ గానీ, ఏ నాయకుడు గానీ ఫ్లోరైడ్ పీడను అంతం చేయలేకపోయారు. కొత్తగా ఎవరూ ఫ్లోరోసిస్ బారిన పడటం లేదని భారత ప్రభుత్వమే పార్లమెంట్ వేదికగా ప్రకటన చేసింది.

135. మిషన్ భగీరథ తెచ్చిన మార్పుతో రాష్ట్రంలో నీళ్ల కోసం వీధిపోరాటాలు లేవు. నియోజకవర్గాల్లో ఖాళీ బిందెల ప్రదర్శనలు లేవు. శాసన సభలో తాగు నీటి కోసం వాగ్యుద్ధాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకంపై నీతి ఆయోగ్

ప్రసంశల జల్లు కురిపించింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం పైసా విదల్చలేదు. మిషన్ భగీరథను ప్రేరణగా తీసుకొని కేంద్రం హర్ ఘర్ జల్ పథకాన్ని దేశమంతటా అమలు చేస్తోంది. ఇందుకోసం కేంద్ర నిధులను వెచ్చిస్తోంది. తాగునీటి సరఫరాలో రోల్‌మోడల్‌గా నిలిచిన తెలంగాణకు మాత్రం నిధులు ఇవ్వలేదు.

**తెలంగాణకు హరితహారం**

136. భూమిపై 33 శాతం పచ్చదనం ఉంటెనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుంది. పచ్చదనం పెంచేందుకు జరుగుతున్న అతిపెద్ద మానవ మహా ప్రయత్నం తెలంగాణకు హరితహారం.

హరితహారంలో భాగంగా ప్రభుత్వం 2015 నుంచి 2022 వరకు 243 కోట్ల మొక్కలను నాటింది. అవకాశం ఉన్న ప్రతీ చోట మొక్కలు నాటి, పెరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నది.

137. అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవుల పునరుద్దరణ కార్యక్రమం పెద్ద ఎత్తున సాగుతున్నది. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కోసం 8,511 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చుచేసింది. రాష్ట్రంలో 2015 సంవత్సరం నుంచి ప్రారంభమైన హరితహారంతో 9 లక్షల 65 వేల ఎకరాల్లో అడవుల పునరుద్దరణ జరిగింది. ముఖ్యమంత్రి గారు ఇస్తున్న ప్రేరణతో హరితహారం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతోంది.

138. నగరాల్లో, పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటి వరకు 109 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేసింది. నేడు తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ చూసినా పెరిగిన పచ్చదనం కనువిందు చేస్తున్నది.

తెలంగాణ ఏర్పడిన నాటితో పోలిస్తే రాష్ట్రంలో గ్రీన్‌కవర్ 7.7 శాతం మేరకు పెరిగిందని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది.

139. ప్రకృతి ప్రేమికులైన ముఖ్యమంత్రి గారు హరితనిధి అనే నూతన భావనను ప్రవేశపెట్టారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, పచ్చదనం అభివృద్ధి కోసం హరితనిధిని ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ. హరిత నిధి ఏర్పాటులో ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ ఉద్యోగులు, సమాజంలోని ఇతర వర్గాల వారందరికీ భాగస్వామ్యం కల్పించేందుకు ప్రభుత్వం వారి నుంచి విరాళాలను కోరింది. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాలన్నది హరిత నిధి ఆశయం.

ఈ వార్షిక బడ్జెట్లో హరిత హారం కార్యక్రమం కింద 932 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది

**సంక్షేమ తెలంగాణ..**

140. ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో సింహభాగం కేటాయిస్తున్నది. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. టి.ఆర్.ఎస్. ప్రభుత్వం సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించిందని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

**అసహాయులకు ఆసరా**

141. తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఫించన్ల మొత్తాన్ని పెద్ద ఎత్తున పెంచింది. వృద్ధులకు, వితంతువులకు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు, నేత, గీత కార్మికులకు నెలనెలా ఇచ్చే ఫించన్ల మొత్తాన్ని 200 రూపాయల నుంచి 2016 రూపాయలకు పెంచింది. దివ్యాంగులకు ఇచ్చే ఫించను 500 నుంచి 3016కు పెంచింది. దేశంలో మరే రాష్ట్రంలోను దివ్యాంగులకు ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్ ఇవ్వడంలేదు. ఆ ఘనత ఒక్క తెలంగాణ రాష్ట్రానిదే.

ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు, బోదకాలు బాధితులకు 2016 రూపాయల చొప్పున ఫించను అందిస్తున్నది.

142. 2014 సంవత్సరంలో ఆసరా ఫించను లబ్దిదారుల సంఖ్య 29,21,828 మాత్రమే. నేడు రాష్ట్రంలో ఆసరా ఫించన్ లబ్దిదారుల సంఖ్య 38 లక్షల 41వేలు. గడిచిన ఏడున్నర సంవత్సరాలలో తెలంగాణ

ప్రభుత్వం 46,650 కోట్ల రూపాయలను నిరుపేదలకు ఇచ్చే ఆసరా పింఛన్ల కోసం ఖర్చు చేసింది. ఇది మా ప్రభుత్వం పేదలపట్ల ప్రదర్శిస్తున్న మానవీయ వైఖరికి నిదర్శనం.

143. వృద్ధాప్య ఫింఛన్ల మంజూరు కోసం విధించిన వయోపరిమితిని ప్రభుత్వం 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించింది. కరోనా పరిస్థితుల నేపథ్యంలో దీని అమలులో కొంత ఆలస్యం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి సడలించిన వయోపరిమితి ప్రకారం కొత్త లబ్దిదారులకు ఆసరా ఫించన్లను ప్రభుత్వం అందజేస్తుంది.

ఆసరా ఫించన్ల కోసం 2022-2023 వార్షిక బడ్జెట్లో 11728 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది

**కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్**

144. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా 10లక్షల మంది పేద ఆడపిల్లలకు పెళ్లి ఖర్చులు అందించిన ఒకే ఒక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం. ఇది సంక్షేమ రంగ చరిత్రలో ఒక రికార్డు. ఆడబిడ్డ పెళ్లికి ఒక లక్షా నూట పదహారు రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కన్నతల్లి చేతుల్లో పెడుతున్నది. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ ప్రయోజనం పొందిన పేద ఆడపిల్లల కుటుంబాలవారు ప్రభుత్వానికి నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వారి ఆశీస్సులే మాకు కొండంత బలం.

145. కళ్యాణ లక్ష్మి ప్రయోజనం పొందడానికి వయోపరిమితి 18ఏళ్లు కావడంతో బాల్య వివాహాలు జరగడంలేదని స్వచ్ఛంద సంస్థల పరిశోధనల్లో వెల్లడయ్యింది.

కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్‌కు వార్షిక బడ్జెట్లో 2750 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది

**పేదలకు ఆహారభద్రత..**

146. ఆహారభద్రత చేకూరినపుడే సమాజం ప్రగతిదారుల వెంట ప్రయాణించ గలుగుతుంది. అందుకే మహాకవి గురజాడ 'తిండి కలిగితే కండ కలదోయ్' అన్నారు. సమైక్య రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డుదారుడికి నెలకు 4 కిలోల బియ్యం మాత్రమే ఇచ్చేవారు. కుటుంబంలో ఎంత మంది సభ్యులున్నప్పటికీ బియ్యం 20 కిలోలకు మించి ఇచ్చేవారు కాదు. తెలంగాణ ప్రభుత్వం ఈ అన్యాయమైన పరిమితిని ఎత్తివేసింది. ప్రతీ ఒక్కరికి ఇచ్చే బియ్యం 6 కిలోలకు పెంచి కుటుంబంలో ఎంత మంది ఉంటె అంతమందికి అందజేస్తున్నది.

**పేదలకు గౌరవ ప్రదమైన నివాసం- డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం:**

147. పేదలకు గౌరవ ప్రదమైన, సౌకర్యవంతమైన నివాసం ఉండాలని తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోంది. వందశాతం సబ్సిడీతో ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇస్తున్నది. ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు లక్షల 91వేల ఇండ్లను మంజూరు చేసింది.

మంజూరైన వాటిలో లక్షా 70వేల ఇండ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.

148. గత పాలకులు పేదల ఇండ్ల నిర్మాణం కోసం చాలా తక్కువ మొత్తాన్ని ఇచ్చేవారు. ఒక్క గది నిర్మించుకోవడం కోసం ఇచ్చే ఆ కొద్ది మొత్తాన్ని దశల వారీగా అందించేవారు. అది సరిపోక ఇళ్లు పూర్తి చేయడం కోసం బలహీన వర్గాల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది. తెలంగాణ ప్రభుత్వం గత ప్రభుత్వాల పద్ధతికి భిన్నంగా ప్రతి లబ్ధిదారునికి పూర్తి ఉచితంగా రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తోంది.

149. సొంత జాగ ఉన్నవారు డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తే బాగుంటుందని పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో సొంత జాగ కలిగినవారు తమ స్థలంలో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టుకోవడం కోసం మూడు లక్షల రూపాయల చొప్పున అందించాలని ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకున్నారు.

150. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మందికి, సొంత స్థలంలో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం కోసం ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం ఇవ్వబోతోంది. నియోజకవర్గానికి మూడువేల ఇండ్ల చొప్పున కేటాయిస్తుంది. వీటిలో మూడు లక్షల యాభై ఏడు వేల ఇండ్లు ఎమ్మెల్యేల పరిధిలో ఉంటాయి. 43 వేల ఇండ్లు ప్రత్యేక

పరిస్థితుల్లో నిర్వాసితులకు, వివిధ ప్రమాద బాధితులకు కేటాయించేందుకు వీలుగా సీఎం గారి పరిధిలో ఉంటాయి. డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిన పథకం.

ఇంత చక్కని గృహాలను పేదవాళ్లకు అందించిన ప్రభుత్వం చరిత్రలో మరొకటి లేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం కోసం 12000 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయిస్తున్నది.

**గ్రామ పంచాయతీలుగా తండాలు, గూడెంలు**

151. మా గూడెంలో మా పాలన... మా తండాలో మా పాలన.. అని ఎస్టీ జనం సుదీర్ఘ కాలం పాటు పోరాడినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఎస్టీ ప్రజల చిరకాల ఆకాంక్షను టీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చింది. రాష్ట్రంలోని అన్ని గూడెంలు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 3146 మంది ఎస్టీలు కొత్తగా సర్పంచులు అయ్యారు.

152. గిరిజన, ఆదివాసీ గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం కోసం ఒక్కొక్క పంచాయతీకి ఇరవై అయిదు లక్షల చొప్పున మొత్తం 600 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయిస్తున్నది. తమ గ్రామాలను తామే పరిపాలించుకుంటున్నారు. ఇది భారత పార్లమెంటరీ పరిపాలన వ్యవస్థలో అపురూపమైన ఘట్టం. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం

ఠంఛనుగా నిధులు విడుదల చేస్తుండటంతో తండాలు గూడెంలు అద్భుతమైన అభివృద్ధికి నోచుకుంటున్నాయి.

153. గ్రామాలకు దూరంగా ఉన్న గిరిజన ఆదివాసీ ప్రాంతాలను విద్యుధీకరణ చేయడం, వారి వ్యవసాయ భూములకు త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కలిగించడం కోసం 215 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టింది. రాబోయే రెండు లేక మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేస్తుంది.

154. ఎస్టీ వినియోగ దారుల గృహ అవసరాలకు నెలకు వంద యూనిట్ల కరెంటును ఉచితంగా ఇవ్వడం జరుగుతోంది.

155. ఎస్టీ నివాస ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం కోసం ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల నుంచి వేయి కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

**ఆదివాసీ, బంజారా భవనాలు**

156. ఆదివాసీ భవన్, బంజార భవన్ ల నిర్మాణానికి ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో విలువైన స్థలాలను కేటాయించింది. 72 కోట్లతో భవనాలను నిర్మించింది. ఇవి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనుల కోసం 32 భవనాల నిర్మాణం చేపట్టింది.

**ప్రభుత్వ పండుగలుగా గిరిజన, ఆదివాసీ ఉత్సవాలు**

157. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతినీ, అదే విధంగా బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ జయంతినీ రాష్ట్ర పండుగలుగా సమున్నతంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నది. సమ్మక్క - సారక్క జాతరను రాష్ట్ర జాతరగా ప్రకటించింది. ఈ ఏడాది జాతరకు 75 కోట్లు కేటాయించింది. నాగోబా జాతర, బౌరంపూర్ జాతర, జంగుబాయి జాతరలను ప్రభుత్వమే ప్రతీ ఏటా నిర్వహిస్తున్నది.

ఈ వార్షిక బడ్జెట్ లో ఎస్టీల సంక్షేమం కోసం 12565 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**బీసీ సంక్షేమం..**

158. రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక విశిష్ట పథకాలను అమలు చేస్తున్నది. వివిధ వృత్తులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. ఇందు కోసం భారీ ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నది.

**గొల్ల కురుమల - మత్స్యకారుల సంక్షేమం**

159. రాష్ట్రంలో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న గొల్ల కురుమలకు భారీ ఎత్తున గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. 11 వేల కోట్ల రూపాయల వ్యయంతో 7.3 లక్షల యూనిట్ల గొర్రెల పంపిణీ లక్ష్యంగా

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ బడ్జెట్ లో గొర్రెల పంపిణీ కోసం ప్రభుత్వం వేయి కోట్ల రూపాయలు కేటాయిస్తోందని తెలియజేస్తున్నాను.

160. రాష్ట్రంలోని వివిధ జలాశయాల్లో ప్రభుత్వమే రొయ్యలు, చేప పిల్లను వదిలి మత్స్య సంపదను అభివృద్ధి చేస్తున్నది. గంగపుత్ర, ముదిరాజ్ కులాల వారికి ఉచితంగా చేపలు పట్టుకునే అవకాశం కల్పించింది. 2014 సంవత్సరంలో 2,637 కోట్ల రూపాయల మత్స్య సంపద ఉండేది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రోత్సాహక చర్యల వల్ల నేడు 5,229 కోట్ల రూపాయల మత్స్య సంపద రాష్ట్రంలో ఉత్పత్తి అవుతోంది.

**నేతన్నకు చేయూత**

161. తెలంగాణ ఏర్పడగానే ప్రభుత్వం నేత కార్మికులతోపాటు, మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని కల్పించింది. బతుకమ్మ చీరల తయారీని అప్పగించింది. నిరంతరం ఉపాధి లభించే విధంగా చేసింది. నూలు రసాయనాల మీద 50 శాతం సబ్సిడీ సదుపాయాన్ని కల్పించింది.

162. రైతు బీమా మాదిరిగానే నేతన్నలకు కూడా ఐదు లక్షల రూపాయల బీమా పథకాన్ని ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రారంభిస్తోంది.

**గీత కార్మికుల సంక్షేమం**

163. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌడన్నల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. చెట్ల రఖం వసూలు చేసే విధానానికి తెలంగాణ ప్రభుత్వం స్వస్తి చెప్పింది.

అంతే కాకుండా 7.98 కోట్ల బకాయిలను రద్దు చేసింది. గీత కార్మికులకు ఆసరా పింఛన్లను ప్రభుత్వం అందిస్తున్నది.

164. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికులకు గతంలో ఎక్స్ గ్రేషియా 2 లక్షలు మాత్రమే లభించేది. తెలంగాణ ప్రభుత్వం ఆ పరిహారాన్ని 5 లక్షలకు పెంచింది. గతంలో శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 50 వేలు మాత్రమే పరిహారం లభించేది. తెలంగాణ ప్రభుత్వం 5 లక్షలకు పెంచింది. గౌడ సోదరులకు మద్యం దుకాణాల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ రిజర్వేషన్ల ద్వారా 393 మద్యం దుకాణాలు రాష్ట్రంలోని గౌడ సోదరులకు లభించాయి. సమైక్య పాలనలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుట్ర పూరితంగా మూసేసిన కల్లు దుకాణాలను తెలంగాణ ప్రభుత్వం తిరిగి తెరిపించింది. తద్వారా 2963 మంది లబ్ధిపొందారు.

165. తాటి చెట్టునుంచి ఉత్పత్తి అయ్యే నీరాను సాఫ్ట్ డ్రింక్ గా ప్రవేశపెట్టడం కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని అమలు చేస్తోంది.

నీరా ఉత్పత్తి, సేకరణ కోసం 20 కోట్ల రూపాయలు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. భువనగిరి దగ్గరలోని నందనంలో నీరా ప్రాసెసింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నెక్లెస్ రోడ్ లో నిర్మిస్తున్న నీరా కేఫ్ ను ప్రభుత్వం త్వరలో ప్రారంభించనుంది.

166. గీత కార్మికుల సంక్షేమం కోసం వంద కోట్ల రూపాయలతో ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోతున్నది.

**బీసీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు**

167. సమైక్య రాష్ట్రంలో 35 కోట్ల ఖర్చుతో 19 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్వహించబడేవి. అందులో కేవలం 7 వేల మంది మాత్రమే చదువుకునేవారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను 281 పెంచింది. ఈ పాఠశాలలో 1 లక్షా 32 వేల 440 మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను, వసతులను పొందగలుగుతున్నారు. ఇందు కోసం ప్రతీ సంవత్సరం రూ.620 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

**మహాత్మ జ్యోతీబా పూలే విద్యానిధి**

168. మహాత్మ జ్యోతిబా పూలే విద్యానిధి పథకం కింద విదేశాలలో విద్యనభ్యసించే బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి 20 లక్షల రూపాయల చొప్పున స్కాలర్ షిప్పులను అందజేస్తోంది.

ఇంత పెద్ద మొత్తంలో బడుగు, బలహీన వర్గాలకు స్కాలర్‌షిప్పులను అందిస్తున్న రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమే.

**సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలు**

169. రాష్ట్ర రాజధానిలో 41 బీసీ కులాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం మొత్తం 82.30 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. వీటి నిర్మాణాల కోసం 95.25 కోట్ల నిధులను విడుదల చేసింది. నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.

బీసీ సంక్షేమం కోసం ఈ వార్షిక బడ్జెట్ లో 5698 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**బ్రాహ్మణ సంక్షేమం**

170. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును 2017 జనవరి 28న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బ్రాహ్మణుల ఉపాధి కోసం పలు పథకాలు అమలవుతున్నాయి.

ఆరు ఎకరాల స్థలంలో పది కోట్ల ఖర్చుతో హైదరాబాద్ లో బ్రాహ్మణ సదన్ నిర్మాణం పూర్తి కావొచ్చింది.

**అర్చకుల సంక్షేమం**

171. గత ప్రభుత్వాల కాలంలో అర్చకులకు, ఆలయ సిబ్బందికి దేవాలయాల ఆదాయం అనుసరించి తక్కువ వేతనాలు వచ్చేవి.

ఆవేతనాలు కూడా మూడు- నాలుగు నెలలకు ఒకసారి అందేవి. తెలంగాణ ప్రభుత్వం అర్చకుల సమస్యలను సానుభూతితో పరిశీలించింది. ఆలయ ఆదాయంతో నిమిత్తం లేకుండా మంచి వేతనాలను అందిస్తోంది.

దేవాదాయ శాఖ పరిధిలోని అర్చకులు, ఇతర సిబ్బందికి ప్రతీ నెల ఠంచనుగా జీతాలు చెల్లించడం కోసం 138 కోట్ల గ్రాంట్-ఇన్-ఎయిడ్ అందజేస్తున్నది. తద్వారా ఆలయ అర్చకులు, సిబ్బంది ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది.

172. ధూప దీప నైవేద్యం పథకం కింద రాష్ట్రంలోని 3645 దేవాలయాలకు నెలకు 6 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం నిధులను అందిస్తున్నది.

173. హైదరాబాద్ పరిధిలోని 1736 దేవాలయకులకు సైతం ధూప దీప నైవేద్య పథకాన్ని కోత్తగా ఈ ఏడాది ప్రభుత్వం వర్తింప జేయబోతున్నది. ఇందుకోసం 12.50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయనుంది.

బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్ లో 177 కోట్ల రూపాయలు కేటాయించడమైనది.

**ఈడబ్ల్యూఎస్ వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు**

174. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ఉద్యోగ నియామకాల్లో, విద్యా సంస్థల ప్రవేశాల్లో పది శాతం రిజర్వేషన్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేస్తున్నది.

**మైనార్టీ సంక్షేమం**

175. తెలంగాణ సర్వమతాల సంస్కృతులు నెలకొన్న ప్రాంతం. అందుకే ఇక్కడి జీవన సభ్యతను మహాత్మగాంధీ 'గంగా జమున తెహజీబ్' గా అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వం సకల మతాలను సమాన భావనతో ఆదరిస్తున్నది. గౌరవిస్తున్నది. వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నది. గడచిన ఏడేళ్లలో మైనార్టీల సంక్షేమానికి 6,644 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

176. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో ఉన్న మైనార్టీ గురుకులాల సంఖ్య కేవలం 12 మాత్రమే. టి ఆర్ ఎస్ ప్రభుత్వం 192 మైనార్టీ గురుకులాలను కొత్తగా ఏర్పాటు చేసింది.

మైనార్టీ బాలికలు చదువులో ముందుండాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. అందుకే 50 శాతం గురుకులాలను మైనార్టీ బాలికల కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఈ గురుకులాలకు విశేష స్పందన లభించింది. నేడు రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల సంఖ్య 204 కు

పెరిగింది. ఈ గురుకులాల్లో మొత్తం లక్షా 14 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుకుంటున్నారు.

177. మైనార్టీ బాలికలు పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 121 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసింది. మైనార్టీ బాలికల ఎన్‌రోల్‌మెంట్ గతంలో 18 శాతం ఉంటె నేడు 42 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల ఎంతో సంతృప్తిని, సంతోషాన్నీ కలిగిస్తోంది. మైనార్టీ బాలికల విద్యావికాసంలో తెలంగాణ నేడు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పడానికి గర్వపడుతున్నాను.

178. రాష్ట్ర వ్యాప్తంగా 54 రెసిడెన్షియల్ మైనార్టీ గురుకులాలకు పక్కా భవనాల నిర్మాణం జరుగుతోంది. హైదరాబాదులోని 29 కాలేజీల భవనాల నిర్మాణం కోసం వక్ఫ్‌బోర్డుతో సంప్రదింపులు జరిపి వక్ఫ్ భూములు ఇవ్వడానికి అంగీకరింపజేసింది. నాంపల్లిలోని అనాథ శరణాలయం అనీస్-ఉల్-గుర్బాను ప్రభుత్వం 40 కోట్లతో పునర్నిర్మించింది. ఈ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

179. రాష్ట్రంలోని మసీదుల్లో ప్రార్థనాదికాలు నిర్వహించే పది వేల మంది ఇమాం, మౌజమ్ లకు నెలకు 5 వేల చొప్పున ప్రభుత్వం గౌరవవేతనం అందిస్తున్నది. మైనార్టీల ప్రధాన పండుగలయిన క్రిస్మస్, రంజాన్ లను ప్రభుత్వ పండుగలుగా ఘనంగా నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా కొత్త

బట్టలను కానుకగా అందిస్తున్నది. ప్రార్థనా మందిరాలకు ప్రత్యేక నిధులను సమకూరుస్తున్నది.

**మహిళా సంక్షేమం - శిశు సంక్షేమం**

180. రాష్ట్రంలోని మహిళలందరికీ ప్రపంచ మహిళా దినోత్సవ ముందస్తు శుభాకాంక్షలు. నేడు సమాజంలో మహిళలు సేవలు అందించని రంగమే లేదు. సమాజ పురోగతిలో మహిళల పాత్ర ప్రాధాన్యతను సంతరించుకున్నది. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది.

**ఆరోగ్య లక్ష్మి**

181. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య లక్ష్మి అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గర్భిణీ స్త్రీలకు అంగన్ వాడీల ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నది. 2014 వరకు 56 శాతం అంగన్ వాడీ కేంద్రాల్లో మాత్రం భోజనం అందించేవారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం కేంద్రాల్లో పాలు, గుడ్లతో కూడిన సమతుల పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నది.

**కేసీఆర్ కిట్లు..**

182. తెలంగాణ ప్రభుత్వం మాతా శిశు సంక్షేమం కోసం కేసీఆర్ కిట్స్ అనే మానవీయ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకం సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తోంది. మగపిల్లల వాడికి

జన్మనిచ్చిన తల్లికి 12 వేలు, ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లికి 13 వేల చొప్పున ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నది. బాలింతకు, నవజాత శిశువుకు ఉపయోగపడేలా 16 వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్‌ను కూడా అందిస్తున్నది. కేసీఆర్ కిట్స్ పథకం వల్ల ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య 30.5 శాతం నుంచి 56 శాతానికి పెరిగింది. ఇప్పటి వరకు ప్రభుత్వం 10 లక్షల 85వేల 462 కేసీఆర్ కిట్లను పంపిణీ చేసింది.

**కేసీఆర్ న్యూట్రీషియస్ కిట్..**

183. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమ్రం భీం ఆసిఫాబాద్, భద్రాచలం కొత్తగూడెం, జయశంకర్‌భూపాలపల్లి, కామారెడ్డి, వికారాబాద్, ములుగు, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలలోని గర్భిణీ స్త్రీలలో, బాలింతలలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ లోపాన్ని నివారించేందుకు, ‘ కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్’ అనే పేరుతో పోషకాహారంతో కూడిన కిట్‌లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కిట్స్ ద్వారా ప్రతి సంవత్సరం లక్షా 25వేల మంది మహిళలు ప్రయోజనం పొందనున్నారు.

**హెల్త్ అండ్ హైజెనిక్ కిట్స్**

184. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో 7 నుంచి 12 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

ఈ పథకం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది బాలికలకు ప్రయోజనం చేకూరనుంది.

**బతుకమ్మ చీరెల పంపిణీ**

185. తెలంగాణ స్త్రీలు సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత బతుకమ్మను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నది. ఈ పండుగ సందర్భంగా ఆడబిడ్డలను గౌరవిస్తూ ప్రభుత్వం చీరలను పంపిణీ చేస్తున్నది. రంజాన్, క్రిస్మస్ సందర్భంగా మైనార్టీ మతాల మహిళలకు ప్రభుత్వం చీరలు బహుకరిస్తున్నది. ఇటీవలే అంగన్ వాడీలకు పోచంపల్లి చీరెలను పంపిణీ చేసింది. దీని ద్వారా నేత కార్మికలకు పని దొరికింది.

186. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డనాడు అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న వేతనం 4200. తమ వేతనాలను పెంచాలని అంగన్‌వాడీలు ఆందోళనకు దిగితే సమైక్య పాలకులు వారిని అమానుషంగా గుర్రాలతో తొక్కించారు.

టి.ఆర్.ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని వారికి ప్రస్తుతం 13650 వేతనం అందిస్తోంది. అదే విధంగా మినీ

అంగన్‌వాడీ టీచర్లకు 7800, అంగన్‌వాడీ హెల్పర్లకు 7800 వేతనం అందిస్తున్నది. అంగన్‌వాడీ స్కీంకు ఇచ్చే నిధులలో కేంద్రం పెద్ద ఎత్తున కోత విధించింది. ఆ భారాన్ని భరిస్తూ కూడా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాన్ని మూడింతలకుపైగా పెంచింది. అంగన్‌వాడీలకు అత్యధిక వేతనం ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది.

**భరోసా కేంద్రాలు**

187. గృహ హింసకు గురవుతున్న మహిళలకు న్యాయ సహాయాన్ని, వైద్య సాయాన్ని తగిన రక్షణను కల్పించడం కోసం మహిళా పోలీసుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.

చిన్నారుల మీద లైంగిక అకృత్యాలకు పాల్పడేవారిని శిక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఫోక్సో కోర్టులను ఏర్పాటు చేసింది. ఈ కోర్టుల నిర్వహణ కోసం అవసరమైన నిధులను మంజూరు చేసింది. బాలల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు, 33 జిల్లాల్లో ప్రత్యేక బాల రక్షక వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**న్యాయవాదుల సంక్షేమం**

188. దేశంలో ఎక్కడా లేని విధంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను కేటాయించింది. నిధుల

నిర్వహణ బాధ్యత అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్టుకు అప్పగించింది. ఈ ట్రస్టు ద్వారా 22 వేల మంది న్యాయవాదులకు ఇన్సూరెన్స్ పాలసీలు అందించింది. ఇది కాక కరోనా సమయంలో 15 వేల మందికి పైగా అడ్వకేట్లకు, క్లర్కులకు 25 కోట్లను సహాయంగా అందించింది.

**జర్నలిస్టుల సంక్షేమం**

189. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం వంద కోట్ల రూపాయల నిధిని ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 52కోట్లు తెలంగాణ ప్రెస్ అకాడమీకి కేటాయించింది. ఎవరైనా జర్నలిస్టు మరణిస్తే ప్రభుత్వం అతని కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని ఈ నిధుల నుండి అందిస్తున్నది. శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నది. మరణించిన జర్నలిస్టు తల్లికీ లేదా భార్యకు అయిదేళ్లపాటు ప్రతి నెలా మూడువేల రూపాయల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. పిల్లలు ఉన్నట్లయితే ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున అదనంగా అందిస్తోంది.

190. కరోనా బారిన పడిన నాలుగు వేల మంది జర్నలిస్టులకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలకు తగ్గకుండా ఆర్థిక సహాయం అందించింది. ఇందు కోసం 5 కోట్ల 68 లక్షలను అందజేసింది.

కరోనాతో మృతిచెందిన డెబ్బై అయిదు జర్నలిస్టు కుటుంబాలకు రెండు లక్షల రూపాయల చొప్పున అందించింది.

**లాక్ డౌన్ కాలంలో ప్రైవేటు టీచర్లకు సాయం**

191. లాక్ డౌన్ సమయంలో ప్రైవేటు పాఠశాలలు పని చేయకపోవడం వల్ల వాటిలో పని చేసే టీచర్లు సమస్యలు ఎదుర్కొన్నారు. వారి పరిస్థితిని గమనించిన ప్రభుత్వం 2 నెలల పాటు 20 కేజీల బియ్యం, 2 వేల రూపాయల ఆర్థిక సాయం ప్రైవేటు టీచర్లకు అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు స్కూళ్లలో ఉన్న2 లక్షల 4 వేల 743 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం అందించింది. ఇందు కోసం ప్రభుత్వం 120 కోట్లు ఖర్చు చేసింది.

**కోవిడ్ సమయంలో సంక్షేమం**

192. లాక్ డౌన్ వల్ల ఆదాయం కోల్పోయిన వారికి ప్రభుత్వం సహాయం అందించింది. పేదల ఆహార భద్రత కోసం రేషన్ కోటా బియ్యం ఒక్కొక్కరికి పది కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఇందు కోసం 2290 కోట్లు వెచ్చించింది.

**ఉద్యోగుల సంక్షేమం**

193. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యాన్ని పంచుకున్న ఉద్యోగులకు రాష్ట్రం అవతరించిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఇంక్రిమెంట్ ను ప్రభుత్వం అందించింది. ఉద్యోగులకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 43 శాతం ఫిట్మెంట్ ను అందించింది. కరోనా తో ఆర్థిక ఒడిదుడుకులకు గురయినా ఉద్యోగుల ప్రయోజనాలు నెరవేర్చడంలో మాత్రం ప్రభుత్వం

వెనుకంజ వేయలేదు. వారి ఆకాంక్షలకు తగిన విధంగా కొత్త పీఆర్సీలో 30 శాతం ఫిట్మెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేసింది.

194. నేడు భారత దేశంలో అత్యధిక స్థాయి వేతనాలు పొందుతున్న ఉద్యోగులు ఎవరంటే, అది మన తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులేనని సగర్వంగా ప్రకటిస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్న యావత్ ప్రభుత్వ సిబ్బందికి 30 శాతం వేతన పెంపును ప్రభుత్వం వర్తింపజేసింది. హోంగార్డులు, అంగన్ వాడి, ఆశావర్కర్లు తదితర సిబ్బంది సైతం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 30 శాతం వేతన పెంపును అందుకున్నారు. ఈ విధంగా దేశంలో ఒక్క టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే వేతనాలు పెంచిందని చెప్పడానికి కూడా గర్విస్తున్నా. విధి నిర్వహణలో మరణించిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ పాలసీని వర్తింజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కార్మిక సంక్షేమం..**

195. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల కోసం సరికొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. మొదటి విడతగా లక్షమందికి సబ్సిడీపై మోటర్ సైకిళ్లను అందజేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సంకల్పించారు. విధివిధానాలను త్వరలో ప్రభుత్వం ప్రకటిస్తుంది.

**సింగరేణి కార్మికుల సంక్షేమం- లాభాల్లో వాటా**

196. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల్లో ఇచ్చే వాటాను రాష్ట్ర ప్రభుత్వం 18 నుంచి 29 శాతం వరకు పెంచుకుంటూ వచ్చింది. తద్వారా 2014 నుంచి 2020 వరకు సింగరేణి కార్మికులకు రూ. 1546.59 కోట్ల లబ్ధి జరిగింది. సింగరేణి కార్మికుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ స్కీం విధి విధానాలను సరళీ కృతం చేయడం ద్వారా 11 వేల 888 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరింది. సింగరేణి కార్మికులకు గృహ నిర్మాణం కోసం పది లక్షలు రూపాయలు వడ్డీలేని రుణం ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టింది.

**జీహెచ్ఎంసీ అభివృద్ధి..**

197. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకున్నది. నగరంలో నాలాల మరమ్మత్తు పనులు 858 కోట్లతో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ 387 కోట్ల రూపాయాలతో సర్వీసు రోడ్ల విస్తరణ జరుగుతోంది.

198. ఒకనాడు హైదరాబాద్ తాగునీటి అవసరాలను సంపూర్ణంగా తీర్చిన జలాశయం గండిపేట చెరువు. ఈ చెరువు నిర్మించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా 36.5 కోట్లతో గండిపేట చెరువును ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తోంది.

199. 1450 కోట్లతో సుంకిశాల నుంచి కృష్ణా జలాలను హైదరాబాదుకు అందించడానికి పైపులైన్ నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం బడ్జెట్ లో 725 కోట్లు కేటాయిస్తున్నది. హైదరాబాద్ సివరేజ్ ట్రీట్మెంట్ కోసం 3,866 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. దక్షిణ భారత దేశంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న తొలినగరం హైదరాబాద్.

200. హైదరాబాద్ నగరం చుట్టూ ఆకుపచ్చని దండ వేసినట్టుగా లక్షా 66వేల ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ ఏర్పాటవుతోంది.

ప్రపంచబ్యాంకు హైదరాబాద్ నగరాన్ని ఓ.డీ.ఎఫ్ ప్లస్ ప్లస్ నగరంగా గుర్తించింది. అదే విధంగా వాటర్ ప్లస్ నగరంగా కూడా గుర్తించింది.

201. నగరంలో ఎస్.ఆర్.డి.పీ కింద 18 ముఖ్యమైన రోడ్లు, ఫ్లైఓవర్ పనులను ప్రభుత్వం పూర్తిచేసింది. సీ ఆర్ ఎం పీ ద్వారా నగరంలోని 530 కిలోమీటర్ల పొడవున ఐదు రోడ్లను అభివృద్ధి (రీ కార్పెటింగ్) చేసింది. ఓవైసీ జంక్షన్ లో కొత్త ఫ్లై ఓవర్‌ను, షెక్ పేటలో మరో కొత్త ఫ్లై ఓవరును ఇటీవల ప్రారంభించింది. ఎల్బీనగర్ - తుకారాం గేట్ అండర్ బ్రిడ్జి, బహదూర్ పూర ఫ్లైఓవర్ వద్ద మరో అండర్ పాస్ నూ, మరో 30 ఫ్లైఓవర్లను, 18 ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను ఈ ఆర్థిక సంవత్సరం లో పూర్తి చేయబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

202. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఔటర్ రింగ్ రోడ్ వరకు సులభంగా

ప్రయాణించేందుకు 39 లింకు రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 22 పూర్తయ్యాయి.

203. మెట్రో రైలు పథకంలో పాతబస్తీలోని 5.5 కి.మీ. మార్గాన్ని అనుసంధానం చేయటం లో అనేక అవాంతరాలు చోటుచేసుకున్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రార్థనా స్థలాలు ఉండటం వల్ల పనులకు ఇబ్బందులు తలెత్తాయి. అవాంతరాలు పరిష్కారమయ్యే సమయానికి కోవిడ్ ప్రభావం వల్ల మెట్రో ప్రాజెక్టు నష్టాల బారిన పడ్డది. కన్సెషనర్‌తో సంప్రదించి ఈ మార్గంలో మెట్రో రైలు నిర్మాణం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

204. ఔటర్ రింగురోడ్ పరిధిలో ఆవాసాలకు తాగు నీటిసౌకర్యం కల్పించేందుకు 1200 కోట్లు ఖర్చు చేస్తోంది.

**పరిపాలనా సంస్కరణలు- నూతన భవనాల నిర్మాణం**

205. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం పరిపాలన అవసరాలకు తగిన విధంగా ప్రభుత్వం వివిధ సంస్కరణలు చేపట్టింది. ఈ సంస్కరణల ఫలితంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతున్నాయి. ప్రభుత్వం రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా పునర్ వ్యవస్థీకరించడంతో పాటు కొత్త డివిజన్లను, కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. దీంతో పరిపాలనలో సౌలభ్యం పెరిగింది.

206. భూ వివాదాలు సమస్యగా తయారవుతున్న నేపథ్యంలో భూపరిపాలనలో సంస్కరణలు తెచ్చింది. భూరికార్డులు ప్రక్షాళన చేసి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేసింది. భూరికార్డులలో పారదర్శకతను సాధించడం కోసం ధరణి పోర్టల్ రూపొందించింది. ధరణి భూ పరిపాలనలో నవ శకానికి నాంది పలికింది.

నూతన రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ విధానం వల్ల పారదర్శకంగా, సరళంగా, వేగంగా, అవినీతి రహితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది.

**రోడ్లు, భవనాలు**

207. రాష్ట్రం ఏర్పడే సమయానికి ఆర్అండ్‌బి రోడ్ల పొడవు 24,245 కి.మీ.లు అందులో రెండు లైన్ల రోడ్లు, అంతకంటే పెద్ద రోడ్లు 27.9 శాతం మాత్రమే ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డాక 1,835 కి.మీ.ల రోడ్ల డబుల్‌లైనింగ్ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో 1,651 కి.మీ.ల రోడ్డు పూర్తయ్యింది. మండలాలను, జిల్లాలను రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేసే రోడ్లను సింగిల్ లైనింగ్ నుంచి డబుల్ లైనింగ్ రోడ్లుగా విస్తరిస్తోంది. మొత్తం 5,574 కి.మీ. ల రోడ్లలో 4,380 కి.మీ.ల రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. 510 వంతెనలను దశలవారీగా విస్తరిస్తోంది. ఇందులో 430 వంతెనల నిర్మాణం పూర్తయ్యింది. ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు, బీటీ రెన్యూవల్స్ కోసం, మెయింటనెన్స్ గ్రాంట్ కింద 1542 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**రీజనల్ రింగ్ రోడ్**

208. హైదరాబాద్ నగరం శర వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్ కు అదనంగా రీజనల్ రింగ్ రోడ్ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు జిల్లాల నుండి హైదరాబాద్ కు మెరుగైన రవాణా సౌకర్యం ఈ రింగ్ రోడ్ ద్వారా కలుగుతుంది. ప్రస్తుత ఔటర్ రింగ్ రోడ్ కు 30 కిలోమీటర్ల అవతల 340 కిలోమీటర్ల పొడవున రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం కానుంది. ఈ రోడ్డు నిర్మాణం తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుంది. ప్రస్తుతం రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగంలో భూసేకరణ పనులు ప్రారంభమయ్యాయి.

209. తెలంగాణ రాష్ట్ర ప్రతిపత్తిని ప్రతిబింబించే విధంగా ప్రభుత్వం నూతన సచివాలయ భవన నిర్మాణాన్ని చేపట్టింది. ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఏడు అంతస్తుల్లో సచివాలయం నిర్మాణం అవుతోంది. మంత్రులుండే అంతస్తుల్లోనే వారి శాఖల కార్యదర్శుల, సెక్షన్ల కార్యాలయాలు ఉంటాయి. అధునాతన హంగులతో సచివాలయం ముస్తాబవుతోంది. కొత్త సచివాలయంలో ప్రజలకు, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు మంచి సౌకర్యాలు ఏర్పడటంతో పరిపాలనలో వేగం పెరుగుతుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. ఈ సంవత్సరంలోనే సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించబోతున్నాం.

210. ముప్పై జిల్లాల్లో సమస్త హంగులతో అధునాతన వసతులతో సమీకృత కలెక్టర్ కార్యాలయాలను ప్రభుత్వం అద్భుతంగా నిర్మిస్తోంది. వీటిలో 14 భవనాల నిర్మాణం పూర్తయ్యింది. ఆరు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 8 త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. కొన్ని రాష్ట్రాల సచివాలయ భవనాలను మించిన తీరులో మన జిల్లా కలెక్టరేట్ భవనాలు ఉన్నాయని ఇతర రాష్ట్రాల వారు కితాబునిస్తున్నారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం శాసన సభ్యుల కోసం క్యాంపు కార్యాలయాలు నిర్మించింది. ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసింది.

211. నగరంలోని హుస్సేన్‌సాగర్ తీరంలో, 125 అడుగుల ఎత్తుతో డాక్టర్ బాబా సాహెబ్‌అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ప్రతిష్టించబోతోంది. స్వతంత్ర భారతదేశానికి దృఢమైన, లిఖిత రాజ్యాంగాన్ని అందించి, దేశ భవిష్యత్తుకు బాటలు వేసిన అంబేద్కర్ మహాశయునికి ప్రభుత్వం ఈ విధంగా ఘనంగా నివాళులర్పిస్తోంది.

212. తెలంగాణ పోరాటంలో అసువులుబాసిన అమరవీరులను స్మరిస్తూ రాష్ట్ర సచివాలయానికి ఎదురుగా, లుంబినీ పార్కు సమీపంలో అమర వీరుల స్మారక స్థూపాన్ని ప్రభుత్వం నిర్మిస్తోంది. పనులు పురోగతిలో ఉన్నాయి.

**దివ్య క్షేత్రంగా యాదాద్రి**

213. సనాతన వైదిక ధర్మాన్ని ఆచరించడమే కాదు. దానికి అపూర్వ వైభవం తీసుకురావాలనే గట్టి సంకల్పం కలిగిన నాయకులు మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు. వారి నాయకత్వంలో ప్రభుత్వం తెలంగాణ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటే విధంగా విశేషంగా కృషి చేస్తోంది.

214. పంచ నారసింహక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం మన యాదాద్రి. యాద ఋషి తపస్సుకు మెచ్చి లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభువుగా వెలసిన పవిత్ర క్షేత్రం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దేవాలయాల పట్ల కూడా వివక్ష కొనసాగింది. దానికి యాదాద్రి కూడా అతీతం కాదు.

215. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పరిపాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే యాదాద్రిని భూలోక వైకుంఠంగా తీర్చిదిద్దడంలో నిమగ్నమయ్యారు.

ప్రఖ్యాత వైష్ణవ ఆగమ పండితులను సంప్రదించి వారి సలహాలూ, సూచనల ప్రకారం, సశాస్త్రీయంగా యాదాద్రి దేవాలయ నిర్మాణం శరవేగంగా జరిగింది. ముఖ్యమంత్రి గారు ఎంతో శ్రద్ధా భక్తులతో ఈ ఆలయ నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆలయ స్థంభాలను, మంటపాలను, గర్భ గుడిని, శిల్ప సౌందర్యం ఉట్టిపడే విధంగా, ప్రముఖ

స్థపతులు ఉజ్వలంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం యాదాద్రి దేవాలయంతో పాటు యావత్ క్షేత్రాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దుతున్నది.

216. వేయి ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యాదాద్రి టెంపుల్ సిటీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. యాదాద్రి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేసేందుకు ప్రజలు భక్తితో విరాళాలు సమర్పిస్తున్నారు. మహా కుంభ సంప్రోక్షణ అనంతరం యాదాద్రి నరసింహ స్వామి భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు. ఇదే విధంగా ఇతర పుణ్య క్షేత్రాలను ప్రభుత్వం అభివృద్ధి చేయబోతున్నది.

217. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు చెందిన భూమి 2000 ఎకరాలకుపైగా గత పాలకుల కారణంగా అన్యాక్రాంతమయింది. తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటం చేసి ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నది. ఇది ఆధ్యాత్మిక ధార్మిక విషయాల పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

**పర్యాటక రంగం...**

218. తెలంగాణ రాష్ట్రం ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలకు నిలయం. రాష్ట్రం ఏర్పడిన వెంటనే ప్రభుత్వం పర్యాటక స్థలాల ఎంపిక కోసం ప్రత్యేక అధ్యయనం నిర్వహించింది. దీని ద్వారా 479 ప్రధాన పర్యాటక స్థలాలను గుర్తించింది. వీటిలో ఆధ్యాత్మిక, ప్రాకృతిక, చారిత్రక, విజ్ఞానాత్మక స్థలాలు

ఎన్నో ఉన్నాయి. ఈ స్థలాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. పర్యాటకులకు కావల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నది.

219. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్, బుద్ధ జయంతి, ప్రపంచ పర్యాటక దినోత్సవం తదితర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నది.

220. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన జలాశయాలన్నీ ప్రకృతి రమణీయమైన ప్రదేశాల్లో ఉండటం విశేషం. ప్రాజెక్టుల పరిధిలో ఉన్న జలాశయాలన్నింటిని అద్భుతంగా తీర్చి దిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. వీటి సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం మంచి వసతులను ఏర్పాటు చేయబోతున్నది. ఇందులో భాగంగా కాళేశ్వరం సర్క్యూట్‌లో టూరిజం అభివృద్ధి కోసం 1500 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఇటీవలే ముఖ్యమంత్రి గారు ప్రకటించారు.

**పరిశ్రమలు- ఐటీ**

221. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ బ్రాండ్‌ఇమేజ్ మరింత పెరిగింది. సుస్థిరమైన ప్రభుత్వం, సుపరిపాలన మేలైన శాంతిభద్రతలు నెలకొనడంతో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. 2015 నవంబర్ లో ప్రవేశపెట్టిన టి.ఎస్ ఐపాస్ చట్టం ప్రరిశ్రమల అనుమతుల ప్రక్రియను సులభతరం చేసింది. ఈ చట్టం

అమల్లోకి వచ్చిన తర్వాత 17,921 పరిశ్రమలకు నూతనంగా అనుమతులు లభించాయి. 13,631 పరిశ్రమలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. 1.07 లక్షల కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ పరిశ్రమల్లో 8.17 లక్షల మందికి ఉపాధి లభించింది. మరో 4,982 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

222. ఇటీవలే తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తద్వారా పది వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ రంగంలో 29 వేల ఉద్యోగాలు రానున్నాయి.

223. ఐటీ రంగంలో తెలంగాణ అప్రతిహతంగా దూసుకుపోతోంది. 1500కు పైగా చిన్న పెద్ద ఐటీ పరిశ్రమలు ప్రస్తుతం హైదరాబాద్‌లో నెలకొని ఉన్నాయి. ప్రపంచ దిగ్గజ కంపెనీలయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఐబీఎం, కాగ్నిజెంట్, అమేజాన్, ఒరాకిల్ తదితర సంస్థలు హైదరాబాద్ నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.

224. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి ఐటీ పరిశ్రమ ద్వారా 3.23 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించేవి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ అభివృద్ధి కోసం తీసుకున్న చర్యల ఫలితంగా 6.29 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. పరోక్ష ఉపాధి అవకాశాలూ పెరిగాయి.

225. కోవిడ్ ప్రభావంతో ప్రపంచం అంతా కుదేలయినా, తెలంగాణ ఐటీ ఎగుమతుల్లో 12.98 శాతం పెరుగుదల నమోదు అయింది. 2021 లో

తెలంగాణ ఐటీ రంగం ఎగుమతుల మొత్తం విలువ లక్షా 45 వేల 522 కోట్లు కావడం గమనార్హం.

226. తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హబ్ గా తీర్చిదిద్దడం కోసం నాస్కాం (NAASCOM) భాగస్వామ్యంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతనంగా ఉనికిలోకి వస్తున్న అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందిపుచ్చుకుంటోంది. ఈ నూతన సాంకేతిక జ్ఞాన సహాయంతో పేద ప్రజలకు వివిధ సేవలు అందజేస్తోంది. ఇందులో భాగంగా డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు, ఏజెన్సీ ఏరియాలకు వేగంగా ఔషధాలను అందించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

227. 'ఆలోచనతో రండి ఆవిష్కరణతో వెళ్లండి' అనే నినాదంతో స్థాపించిన టీ-హబ్, అంకుర సంస్థలకు అద్భుతమైన వరంగా మారింది. ఇదే మాదిరిగా మహిళల కోసం వీ-హబ్ ను ప్రభుత్వం నెలకొల్పింది.

228. తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగంలో సాధించిన అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. భారత ఐటీ పరిశ్రమలో కొత్తగా ఏర్పడుతున్న ప్రతి పది ఉద్యోగాల్లో 3 ఉద్యోగాలను తెలంగాణ ఐటీ రంగమే కల్పిస్తుంది. భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణల శాఖ రూపొందించిన సుపరిపాలన సూచిలో తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య రంగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

**శాంతి భద్రతలు**

229. శాంతి భద్రతల విషయంలో ముఖ్యమంత్రి గారు నమ్మే సిద్ధాంతం ఒక్కటే. ఆర్తులను రక్షించాలంటే.. ధూర్తులను శిక్షించాలి. పట్టుదల కలిగిన గట్టి నాయకుడు ఉంటే రాష్ట్రంలో గుడుంబా గబ్బు ఉండదు.. పేకాట క్లబ్బు ఉండదు.. గ్యాంబ్లింగ్ జబ్బుండదు. మాదక ద్రవ్యాలుండవు. మత ఘర్షణలు ఉండవని సీఎం కేసీఆర్ గారు నిరూపించారు. అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపడంలో తెలంగాణ ప్రభుత్వం రాజీలేని వైఖరిని అవలంబిస్తోంది. పోలీసు శాఖ సమర్ధవంతంగా పనిచేస్తుండటంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు వెల్లివిరుస్తున్నాయి. దీంతో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ అంతకంతకూ పెరుగుతోంది. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి.

230. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పోలీసు శాఖను పటిష్టం చేసింది. ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని సమకూర్చింది. అధునాతన వాహనాలను అందజేసింది. పోలీసులు ప్రజలతో మమేకం అయ్యేలా 'ఫ్రెండ్లీ పోలీస్' విధానాన్ని అమలుచేస్తోంది. ఏడు పోలీసు కమిషనరేట్లను, పది పోలీసు జిల్లాలను, 25 కొత్త సబ్ డివిజన్లను, 31 సర్కిళ్లను కొత్తగా ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ప్రతి పోలీస్ స్టేషన్ నిర్వహణకు ప్రతీ నెల 75 వేల రూపాయలను అందజేస్తోంది.

గత ఆరేళ్లలో 28 వేల 288 పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసింది. పోలీస్ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది.

ట్రాఫిక్ పోలీసులకు 30 శాతం కాలుష్య భత్యాన్ని అదనంగా చెల్లిస్తున్న ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ.

231. రాష్ట్ర వ్యాప్తంగా నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంకోసం దేశంలోనే అత్యధికంగా 8.8 లక్షల సీసీ కెమెరాలను పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. ఇంత పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణ తన ప్రత్యేకతను నిరూపించుకున్నది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 20 అంతస్థుల కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. నేరం జరిగిన 24 గంటల్లో నిందితులను పరిశోధించి పట్టుకునేందుకు తెలంగాణ పోలీసు అధునాతన సాంకేతిక వ్యవస్థను ఉపయోగిస్తున్నారు.

దీంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రత్యేక పరిశోధనా వ్యవస్థలను బలోపేతం చేసింది.

232. మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోంది. గంజాయి ఉత్పత్తి, రవాణాను నిర్మూలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అమాయకులైన యువకులు మాదక ద్రవ్యాల బారిన పడి వారి జీవితాన్ని నాశనం చేసుకోకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాలో భాగస్వాములయిన వారు ఎంతటివారైనా సరే పోలీస్ శాఖ ఉక్కుపాదం

మోపుతోంది. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టుల సంఖ్యను పెంచుతోంది. నిఘా సమాచార వ్యవస్థను పటిష్ఠపరుస్తోంది. గుడుంబా, గాంబ్లింగ్ ముఠాలు తలెత్తకుండా ఇప్పటికే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అదే విధంగా కల్తీ విత్తనాల వ్యాపారం చేసే వారిపై పీడీ యాక్టులు మోపుతోంది.

233. రాష్ట్రంలో పోలీస్ శాఖ సమర్ధవంతగా పని చేయడం వల్ల మత ఘర్షణలు తలెత్తడంలేదు. కొన్ని అరాచక శక్తులు విద్వేషాలను రగిల్చేందుకు శతవిధాలా ప్రయత్నం చేసినా వారి ఆటలను పోలీసులు సాగనివ్వటం లేదు. పోలీసు శాఖ పనితీరుతో తెలంగాణ వ్యాప్తంగా శాంతిభద్రతలు నెలకొనడం వల్ల ప్రజా జీవనం ప్రశాంతంగా కొనసాగుతోంది.

ఈ బడ్జెట్ లో పోలీస్ శాఖకు 9315 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

234. **2022-23 బడ్జెట్ అంచనాలు:**

2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,56,958.51 కోట్ల రూపాయల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. దీనిలో రెవెన్యూ వ్యయం 1,89,274.82 కోట్ల రూపాయలు మరియు క్యాపిటల్ వ్యయం 29,728.44 కోట్ల రూపాయలు.

**ముగింపు**

235. మహాభారతం అనుశాసనిక పర్వంలో చెప్పినట్టు "**ప్రజల పనియే పాలకుని పని, ప్రజల సుఖమే పాలకుని సుఖం, ప్రజల ప్రియమే పాలకుని ప్రియము, ప్రజల హితమే పాలకుని హితము**' గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి తెలంగాణ అభ్యుదయం, గురించిన తపననే తప్ప, వేరే చింతన లేదు. ముఖ్యమంత్రి గారి సారధ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా, పేద, దళిత, వెనుకబడిన వర్గాల ప్రభుత్వంగా, మన్ననలు అందుకుంటున్నది. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగిస్తాం. ఎంతటి కఠిన లక్ష్యాలనైనా సాధించగల. ధీరత్వం, ఆత్మ విశ్వాసమే మాకున్న బలం.

236. ప్రతిఘాతక శక్తులు అవరోధాలను సృష్టిస్తున్నా వాటిని జయించగల సత్తా తెలంగాణ ప్రభుత్వానికి ఉంది. ప్రజల మీదే మా విశ్వాసం. మనసా,వాచా,కర్మణా ప్రజల శ్రేయస్సు కోసమే కృషి చేస్తాం.

237. తెలంగాణ అభివృద్ధి కోసం, తద్వారా జాతి నిర్మాణం కోసం పునరంకితమవుతామని సవినయంగా తెలియజేస్తున్నాను. ఇది మాకు తెలంగాణ ఉద్యమం నేర్పిన సంస్కారం. దీన్ని భవిష్యత్తులోను కొనసాగిస్తాం అని తెలియజేస్తు 2022-23 సంవత్సరానికి గాను రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను సభ ఆమోదం కోసం ప్రవేశపెడుతున్నాను.

**//జై హింద్.. జై తెలంగాణ//**